# క్రైమ్ మిర్రర్®

Voice of Anti Corruption

హైదరాబాద్
9-8-2026
వెల: రూ.5/-
పేజీలు: 8
సంపుటి:16
సంచిక: 138

PUBLISHED FROM HYDERABAD CIRCULATED BY RANGAREDDY, NALGONDA, KHAMMAM, KARIMNAGAR, WARANGAL, MAHABOOBNAGAR, MEDAK, NIZAMABAD, ADILABAD




## కవితపై బిఆర్ఎస్ సైలెన్స్!

మౌనంగా ఉండాలని పార్టీ శ్రేణులకు కేసీఆర్ ఆదేశం

రెచ్చగొట్టే ప్రకటనలు వద్దు

నాయకులకు స్పష్టమైన ఆదేశాలు



కవిత విషయంలో గులాబీ పార్టీ సైలెన్స్ ఎందుకు పాటిస్తుంది? ఆమె విషయంలో ఎందుకు స్పందించడం లేదు? బిఆర్ఎస్ పై ఆమె విమర్శలు చేస్తున్నా చూసి చూడనట్టుగా ఎందుకు విడిచిపెడుతోంది? పొలిటికల్ వర్గాల్లో దీనిపైనే చర్చ నడుస్తోంది. గత కొంతకాలంగా తెలంగాణ రాజకీయాలను పరిశీలిస్తే గులాబీ పార్టీ నేతలు కవితపై విమర్శలు చేసిన సందర్భాలు లేవు. కానీ అదే సమయంలో కవిత మాత్రం గులాబీ పార్టీపై తీవ్రస్థాయిలో విరుచుకుపడుతున్నారు. కేటీఆర్ తో పాటు హరీష్ రావును టార్గెట్ చేస్తున్నారు. అంత చేస్తున్న గులాబీ పార్టీ నేతల మౌనం వెనుక ఉన్న వ్యూహం అనేది ఏంటో అర్థం కావడం లేదు.

క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో

## గులాబీ బాస్ ఉదారత!

మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి భారీ సాయం

రూ. 2.25 కోట్లు అందించిన కెసిఆర్

ఉద్యమ, రాజకీయ సహచరుడి కుటుంబ సభ్యులకు అండ



2లో

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** గులాబీ బాస్ గొప్ప మనసు చాటుకున్నారు. నర్సంపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ ఉద్యమ నాయకుడు పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి అండగా నిలిచేందుకు నిర్ణయించుకున్నారు. ఇటీవల తీవ్ర అనారోగ్యంతో

## ఆత్మరక్షణలో హరీష్ రావు!



మళ్లీ సెంటిమెంట్ అస్త్రం

వ్యక్తిగత, భాగస్వామ్య వ్యాపార ఆరోపణలు రావడంతో యూటర్న్

నీళ్ల రాజకీయం మొదలుపెట్టిన ట్రబుల్ షూటర్

మాజీ మంత్రి హరీష్ రావు ఆత్మరక్షణలో పడ్డారా? తనపై వచ్చిన ఆరోపణలను ఆయన నివృత్తి చేయలేకపోతున్నారా? వాటి నుంచి దృష్టి మళ్లించేందుకు సెంటిమెంటు రగిలించేందుకు ప్రయత్నం చేస్తున్నారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. తెలంగాణ రాజకీయాల్లో తనకంటూ ముద్ర చూపిన హరీష్ రావు ఇప్పుడు అత్యంత క్లిష్ట పరిస్థితి ఎదుర్కొంటున్నారు. అందుకే పాత సెంటిమెంట్ కార్డును తెరపైకి తెచ్చినట్లు స్పష్టమవుతోంది.

**క్రైమ్ మిర్రర్, తెలంగాణ బ్యూరో:** తనపై వచ్చిన తీవ్రమైన బ్లాక్ మ్యాజిక్ ఆరోపణలతో పాటు వ్యాపార భాగస్వామ్యానికి సంబంధించిన మిల్చీ మిల్క్ విభాగం పై సరిగ్గా స్పందించలేకపోతున్నారు. సమాధానం చెప్పలేక డిఫెన్స్ లో పడిపోతున్నారు. సదరు అంశాలపై స్పందించకుండా.. ఇప్పుడు హఠాత్తుగా ఏపీ ప్రాజెక్టులు,

2లో



## కఠినంగా మారిన కెనడా..

వేలమంది భారతీయులను వెనక్కి పంపేసింది!

ఈ ఏడాది తొలి ఆరు నెలల్లో 3,323 మంది భారతీయులను బహిష్కరించిన కెనడా

బహిష్కరణ జాబితాలో మెక్సికన్లను దాటి అగ్రస్థానానికి చేరిన భారతీయులు

వలస నిబంధనల ఉల్లంఘన, వీసా మోసాలే ప్రధాన కారణం

మరో 7,669 మంది ఇండియన్స్ బహిష్కరణ జాబితాలో ఉన్నారని అధికారిక డేటా వెల్లడి

కెనడాలో నివసిస్తున్న భారతీయులకు ఆందోళన కలిగించే విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఏడాది తొలి ఆరు

## పథకాల పండుగ

పంద్రాగస్టు నాడు కొత్త ఆసరా పెన్షన్లు

మరో 4 లక్షల ఇళ్లకు ఉచిత విద్యుత్

5 లక్షల మందికి సిలిండర్ సబ్సిడీలు

గిగ్ వర్కర్ల చట్టం అమలు

మరిన్ని పథకాలపై ప్రకటనలు

స్వాతంత్ర్య దినోత్సవాన సర్కారు కానుకలు



స్వాతంత్ర్య దినోత్సవాన జెండా పండుగ.. తెలంగాణలో ఈసారి పథకాల పండుగ కానుంది. రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ పథకాల కింద కొత్త లబ్ధిదారులకు అవకాశం కల్పించనుంది. ఇందులో భాగంగా రెండున్నర లక్షల మందికి కొత్తగా ఆసరా పెన్షన్లు ఇవ్వనుంది. 3-4 లక్షల మందికి గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ అందించనుంది. మహాలక్ష్మి పథకం కింద కొత్తగా ఐదు లక్షల మందికి గ్యాస్ సిలిండర్ ను సబ్సిడీతో రూ.500 పంపిణీ చేయనునుంది. ఇక ప్రస్తుతం ఆహార భద్రత కార్డులు ఉన్నవారందరికీ స్మార్ట్ రేషన కార్డులను అందజేయనుంది.

మరోవైపు గిగ్ వర్కర్ల చట్టాన్ని కూడా ఆగస్టు 15 నుంచే అమల్లోకి తీసుకురావాలని భావిస్తోంది. రాష్ట్రంలో ప్రస్తుతం వితంతువులు, వృద్ధులు, దివ్యాంగులు, బీడీ కార్మికులు, ఒంటరి మహిళలు, గీత కార్మికులు, హెచఐవీ-ఏఆర్‌టీ, చేనేత కార్మికులు,

3లో

## ఏపీ క్యాబినెట్లో భారీ ఉద్వాసన!



ఏపీలో ఐదుగురు మంత్రులపై ఉద్వాసన తప్పదా? చంద్రబాబు సీరియస్ గా ఉన్నారా? వారి పనితీరు మెరుగుపడడం లేదా? అందుకే మార్చేస్తారా? ఏపీ పొలిటికల్ సర్కిల్స్లో దీనిపైనే ప్రచారం నడుస్తోంది. స్థానిక సంస్థల ఎన్నికల తర్వాత మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ ఉంటుందని తెలుస్తోంది.

### ఐదుగురు అవుట్

పనితీరు బాగా లేకపోవడం కారణం

రాజకీయంగా ముద్ర చూపలేకపోతున్న వైనం

తీవ్ర అసహనంలో చంద్రబాబు

స్థానిక సంస్థల తర్వాత విస్తరణ

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ప్రధానంగా ఐదుగురు మంత్రులపై కత్తి వేలాడుతోంది. దీనిపై రకరకాల ప్రచారం సాగుతోంది. ఉత్తరాంధ్ర నుంచి ఇద్దరు.. కోస్తాంధ్ర నుంచి ఇద్దరు.. రాయలసీమ నుంచి

2లో



## వైయస్సార్ కాంగ్రెస్‌కు షాక్!

ఆ పార్టీకి మేకపాటి ఫ్యామిలీ గుడ్ బై

త్వరలో తెలుగుదేశం పార్టీలోకి

నెల్లూరు జిల్లాలో మారుతున్న రాజకీయాలు

**క్రైమ్ మిర్రర్, ఏపీ బ్యూరో:** ఏపీలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి షాక్ తగలనుందా? ఆ పార్టీకి సీనియర్ నాయకుడు ఒకరు గుడ్ బై చెబుతారా? ఫ్యామిలీతో సహా టిడిపిలో చేరుతారా? అంటే అవుననే సమాధానం వినిపిస్తోంది. జరుగుతున్న పరిణామాలు కూడా అలానే ఉన్నాయి. ఇంతకీ ఎవరా నేత? ఏంటా కథ అంటే..

2లో

## నేనేం బాబా బాగేశ్వర్‌ను కాదు, కానీ..!:


విద్యార్థులను నవ్వించిన ప్రధాని మోదీ

ఐఐటీ ఢిల్లీ స్నాతకోత్సవంలో బాబా బాగేశ్వర్ పేరును ప్రస్తావించిన ప్రధాని

డిగ్రీలతో పాటు దేశం కోసం ఏదైనా చేయాలనే కలను మోసుకెళ్తున్నారన్న మోదీ

3,000 మందికి పైగా విద్యార్థులకు డిగ్రీల ప్రదానం, ప్రతిభావంతులకు పురస్కారాలు

ప్రతిభావంతులైన విద్యార్థినుల సంఖ్య పెరగాలంటూ సరదాగా వ్యాఖ్య



ప్రధాని నరేంద్ర మోదీ నేడు ఢిల్లీలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటీ) స్నాతకోత్సవంలో పాల్గొన్నారు.

3లో

## షబ్బీర్ అలీ గెస్ట్ హౌస్ ప్రహరీ కూల్చివేత


దారి మూసేశారంటూ రైతుల రచ్చ

మెదక్ జిల్లా జప్తిశివునూర్‌లో షబ్బీర్ అలీ గెస్ట్ హౌస్ ప్రహరీని కూల్చేసిన రైతులు

శతాబ్దాల నాటి దారిని మూసేసి కాంపౌండ్ కట్టారంటూ ఆగ్రహం

తమకు దారి చూపే వరకు తగ్గేదే లేదని హెచ్చరిక

పంట పొలాలకు వెళ్లే దారిని మాయం చేశారంటూ ఆగ్రహించిన గ్రామస్తులు... రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ గెస్ట్ హౌస్ కాంపౌండ్ వాల్‌ను నేలమట్టం చేశారు. మెదక్ జిల్లా






# ఏపీ క్యాబినెట్లో భారీ ఉద్వాసన!

ఒకరు క్యాబినెట్ నుంచి అవుట్ కాక తప్పదని తెలుస్తుండడం ఆందోళన కలిగిస్తోంది.

**స్థానిక ఎన్నికలు పూర్తి..**

కూటమి అధికారంలోకి వచ్చి రెండు సంవత్సరాలు దాటుతోంది. మరోవైపు స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ప్రభుత్వం భావిస్తోంది. డిసెంబర్ లోగా ఈ ఎన్నికల ప్రక్రియ పూర్తి చేయాలని చూస్తోంది. ముందుగా మున్సిపాలిటీలకు, తరువాత పంచాయతీలకు, చివరిగా ప్రాదేశికాలకు ఎన్నికలు జరపాలని చూస్తోంది కూటమి ప్రభుత్వం. అయితే ఈ ప్రక్రియ డిసెంబర్ లో ముగుస్తుంది. అందుకే సంక్రాంతి తర్వాత మంత్రివర్గ విస్తరణ ఉంటుందన్న టాక్ నడుస్తోంది. ఓ అయిదుగురు మంత్రులు క్యాబినెట్ నుంచి అవుట్ అవుతారని.. ఇప్పటికే ఖాళీగా ఉన్న ఒక మంత్రి పదవితో కలుపుకొని ఆరుగురిని భర్తీ చేస్తారని తెలుస్తోంది. అయితే ఆశావహులు ఓ 10 మంది వరకు ఉన్నారు. అందులో సీనియర్ నేతలు సైతం ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం క్యాబినెట్లో ఉన్న పదిమంది మంత్రులు కొత్తగా ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వారే. రకరకాల సమీకరణలను పరిగణలోకి తీసుకుని వారిని ఎంపిక చేశారు చంద్రబాబు. కానీ ఆయన ఆకాంక్షలకు అనుగుణంగా వారు పని చేయడం లేదు. శాఖ పరంగా మెరుగైన పనితీరు కనబరచడం లేదు. ఫైళ్లను క్లియరెన్స్ చేయడం లేదు. రాజకీయంగా దూకుడు ప్రదర్శించడం లేదు. ముఖ్యంగా వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ నుంచి వచ్చే విమర్శలను తిప్పి కొట్టడం లేదు. ఈ పరిణామం తోనే చంద్రబాబు ఓ ఐదుగురు మంత్రులను క్యాబినెట్ నుండి తప్పించేందుకు సూత్రప్రాయంగా ఒక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

**మహిళా మంత్రులు సైతం..**

ప్రస్తుతం క్యాబినెట్లో మహిళా మంత్రులు సైతం ఉన్నారు. అందులో ఒకరిద్దరి మార్పు తప్పదు అని తెలుస్తోంది. ఇంకోవైపు ఉత్తరాంధ్ర నుంచి ఒక మంత్రి అవుట్ అవుతారని.. ఆయన స్థానాన్ని అదే జిల్లాలో సీనియర్ ఎమ్మెల్యేతో భర్తీ చేస్తారని తెలుస్తోంది. ఉభయగోదావరి జిల్లాలతో పాటు కోస్తాంధ్ర జిల్లాల్లో ఇద్దరు మంత్రులను తొలగించడం ఖాయం అన్నట్లు ప్రచారం సాగుతోంది. పనితీరుపరంగా కాకుండా రాజకీయంగాను ఇద్దరు పై పెద్దగా పాజిటివ్ లేదు. అందుకే ఆ ఇద్దరినీ పక్కన పెట్టి వారి స్థానంలో సీనియర్ నేతలకు ఛాన్స్ ఇస్తారని తెలుస్తోంది. రాయలసీమలో ఒకరిని మంత్రి పదవి నుంచి తొలగించి.. మరో సీనియర్ నేతతో భర్తీ చేస్తారని ప్రచారం సాగుతోంది. లేనిపోని వివాదాల్లో కొంతమంది మంత్రులు తలదూర్చుతున్నారు. నియోజకవర్గాల్లో మద్యం, మట్టి మాఫియాలకు దూరంగా ఉండాలని సీఎం చంద్రబాబు ఆదేశించారు. కానీ కొన్ని జిల్లాల్లో మంత్రులు స్వయంగా ఈ తతంగాన్ని నడుపుతున్నారు. ఈ విషయం నిఘా వర్గాల ద్వారా చంద్రబాబుకు తెలిసింది. అందుకే ఆయన గట్టి హెచ్చరికలు పంపారు. అయినా సరే వారి వైఖరిలో మార్పు రావడం లేదు.

# షబ్బీర్ అలీ గెస్ట్ హౌస్ ప్రహరీ కూల్చివేత

నార్సింగి మండలం జప్తిశివునూర్‌లో ఈ ఉదయం ఒక్కసారిగా విరుచుకుపడ్డ రైతులు, శతాబ్దాల నాటి ప్రధాన బాటను మూసివేసి కాంపౌండ్ కట్టడంపై తీవ్ర నిరసన వ్యక్తంచేశారు. గతంలో ఈ సమస్యపై షబ్బీర్ అలీకి మొరపెట్టుకున్నా ఫలితం లేకుండా పోయిందని... పొలాలకు రాకపోకలు బంద్ కావడంతోనే తాము ఈ నిర్ణయం తీసుకోవాల్సి వచ్చిందని స్థానికులు మండిపడ్డారు. విషయం తెలుసుకుని రంగంలోకి దిగిన పోలీసులు గ్రామస్తులను అడ్డుకునే ప్రయత్నం చేయడంతో ఇరువర్గాల మధ్య గొడవ జరిగింది. పోలీసులతో వాగ్వాదానికి దిగిన స్థానికులు తమకు దారి చూపే వరకు వెనక్కి తగ్గేదే లేదని స్పష్టం చేయడంతో జప్తిశివునూర్‌లో తీవ్ర ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఊరిలో భారీగా పోలీసు బలగాలను మోహరించారు.

# కఠినంగా మారిన కెనడా..

కెనడాలో నివసిస్తున్న భారతీయులకు ఆందోళన కలిగించే విషయం వెలుగులోకి వచ్చింది. ఈ ఏడాది తొలి ఆరు నెలల్లోనే కెనడా ప్రభుత్వం ఏకంగా 3,323 మంది భారత పౌరులను దేశం నుంచి బహిష్కరించింది. ఈ సంఖ్య గత ఆరేళ్ల రికార్డులను మించిపోయేలా ఉండటం గమనార్హం. కెనడా బోర్డర్ సర్వీసెస్ ఏజెన్సీ (సీబీఎస్ఏ) విడుదల చేసిన అధికారిక గణాంకాల ప్రకారం ఈ వివరాలు వెల్లడయ్యాయి. 2025 ఏడాది మొత్తంలో 3,779 మంది భారతీయులను బహిష్కరించగా, ఈ ఏడాది కేవలం ఆరు నెలల్లోనే ఆ సంఖ్యలో దాదాపు 88 శాతానికి చేరుకోవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోంది. వలస నిబంధనలను కఠినతరం చేస్తున్న నేపథ్యంలోనే ఈ బహిష్కరణలు పెరిగినట్లు స్పష్టమవుతోంది. అంతర్జాతీయ విద్యార్థులు, తాత్కాలిక విదేశీ కార్మికుల సంఖ్యను తగ్గించుకునేందుకు కెనడా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్న తరుణంలో ఈ డేటా ప్రాధాన్యం సంతరించుకుంది. ఇప్పటివరకు కెనడా నుంచి బహిష్కరణకు గురైన వారి జాబితాలో మెక్సికన్లు అగ్రస్థానంలో ఉండేవారు. కానీ, ఈ ఏడాది భారతీయులు వారిని అధిగమించారు. తొలి అర్ధభాగంలో 3,323 మంది భారతీయులను బహిష్కరించగా, మెక్సికన్ల సంఖ్య 1,573గా ఉంది. గత ఐదేళ్లుగా బహిష్కరణల జాబితాలో మెక్సికో మొదటి స్థానంలో, భారత్ రెండో స్థానంలో కొనసాగాయి. చివరిసారిగా 2020లో 1,424 మందితో భారతీయులు అగ్రస్థానంలో నిలిచారు. వలస నిబంధనలను పాటించకపోవడం, వీసా గడువు ముగిసినా అక్కడే ఉండిపోవడం, ఆశ్రయం కోసం చేసుకున్న దరఖాస్తులు తిరస్కరణకు గురవడం, వీసా మోసాలకు పాల్పడటం వంటి కారణాలతోనే కెనడా ప్రభుత్వం ఎక్కువగా బహిష్కరణ వేటు వేస్తున్నట్లు తెలుస్తోంది. సీబీఎస్ఏ డేటా ప్రకారం.. మరో 7,669 మంది భారతీయులు బహిష్కరణ ప్రక్రియ జాబితాలో ఉన్నారు. అంటే.. సమీప భవిష్యత్తులో వీరిని కూడా దేశం విడిచి వెళ్లమని ఆదేశించే అవకాశం ఉంది. బహిష్కరణ ఉత్తర్వులు సాధారణంగా మూడు రకాలుగా ఉంటాయి. డిపార్చర్ ఆర్డర్ పొందిన వారు 30 రోజుల్లో స్వచ్ఛందంగా దేశం విడిచి వెళ్లాలి. లేదంటే అది డిపోర్టేషన్ ఆర్డర్‌గా మారుతుంది. ఎక్స్‌క్లూజన్ ఆర్డర్ కింద ఒకటి నుంచి ఐదేళ్ల వరకు కెనడాలోకి తిరిగి ప్రవేశించకుండా నిషేధం విధిస్తారు.

# వైయస్సార్ కాంగ్రెస్‌కు షాక్!

(మొదటి పేజీ తరువాయి)

నెల్లూరు జిల్లాకు చెందిన సీనియర్ నాయకుడు మేకపాటి రాజమోహన్ రెడ్డి తన ఫ్యామిలీతో సహా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి గుడ్ బై చెబుతారని జోరుగా ప్రచారం నడుస్తోంది. గత కొంతకాలంగా పార్టీలో జరుగుతున్న పరిస్థితులు, జగన్ వైఖరి నచ్చక ఆయన ఈ నిర్ణయానికి వచ్చినట్లు టాక్ నడుస్తోంది. ఇప్పటికే ఒక నిర్ణయానికి వచ్చారని... త్వరలో ఆయన పార్టీకి గుడ్ బై చెప్పడం ఖాయమని తెలుస్తోంది.

**సుదీర్ఘ నేపథ్యం..**

ప్రకాశం తో పాటు నెల్లూరు జిల్లా రాజకీయాల్లో తనకంటూ ఒక ముద్ర చూపారు మేకపాటి రాజమోహన్ రెడ్డి. ఒకవైపు రాజకీయాల్లో ఉంటూనే ఆ కుటుంబం వ్యాపార రంగంలో స్థిరపడింది. ఎంపీగా సుదీర్ఘకాలం ప్రాతినిధ్యం వహిస్తూ వచ్చారు రాజమోహన్ రెడ్డి. రాజశేఖర్ రెడ్డి కి అత్యంత సన్నిహితమైన నేతగా ముద్రపడ్డారు. ఆ అనుబంధం తోనే జగన్మోహన్ రెడ్డి వెంట అడుగులు వేసారు. ఎంపీ పదవిని వదులుకొని మరి కాంగ్రెస్ పార్టీ నుంచి బయటకు వచ్చారు. అయితే నెల్లూరు జిల్లాలో పెద్దదిక్కుగా ఉన్న మేకపాటి రాజమోహన్ రెడ్డిని జగన్మోహన్ రెడ్డి నిర్లక్ష్యం చేశారన్న విమర్శ ఉంది. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు పెద్ద ప్రాధాన్యం ఇవ్వలేదు. ఇప్పుడు కూడా ఆయన సూచనలను గౌరవించడం లేదు. గౌరవం లేని పార్టీలో



ఉండకూడదు అనేది మేకపాటి భావన. అందుకే త్వరలో ఆ పార్టీకి గుడ్ బై చెప్పేందుకు ఒక నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది.

**ఎనలేని గౌరవం..**

1989 నుంచి ఎంపీ అవుతూ వస్తున్నారు రాజమోహన్ రెడ్డి. నెల్లూరు రాజకీయాల్లో ఆయనకు పెద్దపీట వేస్తూ వచ్చారు రాజశేఖర్ రెడ్డి. అందుకే రాజశేఖర్ రెడ్డి అకాల మరణంతో ఆయన కుమారుడు జగన్మోహన్ రెడ్డి వెంట అడుగులు వేయాలని భావించారు. ఎంపీ పదవిని వదులుకొని వచ్చినందుకు ఆయనకు రాజ్యసభ పదవి కూడా ఇచ్చారు జగన్. ఇంకో వైపు 2019లో గెలిచిన మేకపాటి తనయుడు గౌతమ్ రెడ్డికి పరిశ్రమల శాఖ మంత్రిగా అవకాశం కల్పించారు. కానీ గౌతమ్ రెడ్డి అకాల మరణంతో మేకపాటి రెండో కుమారుడు విక్రమ్ రెడ్డికి శాసనసభ్యుడిగా అవకాశాన్ని ఇచ్చారు. కానీ మంత్రి పదవి ఇవ్వలేదు. పార్టీ అధికారంలో ఉన్నప్పుడు మేకపాటి రాజమోహన్ రెడ్డికి ప్రాధాన్యం లేదు. అంతకుమించి పదవి లేదు. పైగా నెల్లూరు జిల్లాలో అనిల్ కుమార్ యాదవ్, కాకాని గోవర్ధన్ రెడ్డి లాంటి వారికి అవకాశాలు ఇచ్చి నిర్లక్ష్యం చేశారన్న ఆవేదన మేకపాటిలో ఉండిపోయింది.

**పట్టించుకోని జగన్..**

వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఓడిపోయిన తర్వాత నోరు విప్పారు మేకపాటి. పార్టీలో పరిస్థితులు బాగాలేదని.. కోటరీతో జగన్తో పాటు వైసీపీకి నష్టం జరుగుతోందని సంచలన ఆరోపణలు చేశారు. తనలో ఉన్న అసంతృప్తిని బయటపెట్టారు. కానీ జగన్మోహన్ రెడ్డి ఆయనను పిలిచి మాట్లాడలేదు. దీంతో పార్టీలో కొనసాగడం కంటే బయటకు వెళ్ళిపోవడమే మేలన్న నిర్ణయానికి వచ్చారు. చంద్రబాబు సైతం మేకపాటి విషయంలో సానుకూలంగా ఉండడంతో టిడిపిలో చేరేందుకు గ్రీన్ సిగ్నల్ లభించినట్లు తెలుస్తోంది. త్వరలో మేకపాటి టిడిపిలో చేరడం ఖాయమని ప్రచారం జరుగుతోంది. మరి ఇందులో ఎంత వాస్తవం ఉందో చూడాలి.

# కవితపై బిఆర్ఎస్ సైలెన్స్!

(మొదటి పేజీ తరువాయి)

**అధినేత ఆదేశాలు..**

కవిత విషయంలో గులాబీ పార్టీ నేతలకు కేసిఆర్ స్పష్టమైన ఆదేశాలు జారీ చేసినట్లు తెలుస్తోంది. కవిత ఎటువంటి వ్యాఖ్యలు చేసినా రెచ్చిపోవద్దని.. దానికి కౌంటర్లు ఇవ్వొద్దు అంటూ పార్టీ నాయకులందరినీ సూచించింది. కవితను మౌనంతోనే దెబ్బతీయాలన్నది ప్రణాళికగా అర్థమవుతోంది. కవితను రెచ్చగొట్టే కొద్ది ఆమె మరింత మాటలు దాడి చేసి.. తమకు రాజకీయంగా ఇబ్బంది కలిగిస్తారని భావించిన భారత రాష్ట్ర సమితి నాయకత్వం.. సైలెంట్ గా ఉండడమే మేలన్న అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఎన్ని రకాల విమర్శలు ఎదురైనా పట్టించుకోవద్దని ఆదేశాలు నాయకత్వం నుంచి వచ్చినట్లు సమాచారం.

**తొలినాళ్లలో విమర్శలు..**

కవిత పార్టీ నుంచి సస్పెండ్ అయిన తొలినాళ్లలో మాజీ మంత్రి హరీష్ రావు, మాజీ ఎంపీ సంతోష్ రావులపై విరుచుకుపడ్డారు. మహబూబ్నగర్ జిల్లాతో పాటు పలు జిల్లాల్లో మాజీ మంత్రులపై కూడా ఆమె వ్యక్తిగత విమర్శలు చేశారు. నాడు జగదీశ్వర్ రెడ్డి తో పాటు పలువురు సీనియర్లు కవిత విమర్శలకు కౌంటర్ ఇచ్చారు. కానీ ఆమె వెనక్కి తగ్గలేదు. గులాబీ పార్టీని ఇబ్బంది పెట్టే ప్రయత్నం చేశారు. ప్రాణం ఉండగా తాను ఇక బిఆర్ఎస్ లోకి వెళ్ళనని కూడా తేల్చి చెప్పారు. అంతటితో ఆగకుండా సొంత పార్టీని ఏర్పాటు చేశారు.

**ఫలించని మంత్రాంగం..**

ప్రధానంగా కవిత గులాబీ పార్టీ పైనే ఫోకస్ చేశారు. ఆ పార్టీ నుంచి పెద్ద ఎత్తున చేరికలు ఉంటాయని భావించారు. కానీ ఆశించిన స్థాయిలో ఆ చేరికలు లేవు. ఇతర పార్టీల నుంచి కూడా కవిత పార్టీలో చేరిన నాయకులు కనిపించడం లేదు. ఈ తరుణంలో అనవసరంగా ఆమెను హైలైట్ చేసి.. బలోపేతం చేయకూడదు అనేది కేసీఆర్ వ్యూహం. కవిత వ్యాఖ్యలతో సెంటిమెంటు మరింత ఎగసిపడి.. రాజకీయంగా తమకు లాభిస్తుంది అనేది కేసీఆర్ అంచనా. తెలంగాణ కాంగ్రెస్ పార్టీకి దగ్గరగా ఆమె వ్యాఖ్యలు, విమర్శలు ఉంటే.. ఆమె వెనుక కాంగ్రెస్ పార్టీ ఉందన్నది ప్రజల్లోకి తీసుకెళ్లాలని కేసీఆర్ ఆలోచన. అందుకే కుమార్తె విషయంలో వ్యూహాత్మక మౌనాన్ని పాటిస్తున్నారు కేసీఆర్.

# ఆత్మరక్షణలో హరీష్ రావు!



గోదావరి బోర్డు సమావేశాల అంశంపై పెద్ద ప్రెస్ మీట్ పెట్టి సెంటిమెంట్ రగిలించే ప్రయత్నం చేస్తున్నారు.

**గత ఆరోపణలని తిప్పి..**

హరీష్ రావు దాడి మామూలుగా ఉండదు. కానీ ఎందుకో ఆత్మరక్షణలో భాగంగా ఆయన మళ్లీ నీళ్ల రాజకీయాలు మొదలుపెట్టినట్లు అర్థం అవుతోంది. దీనిపై విమర్శలు కూడా వ్యక్తం అవుతున్నాయి. అయితే గోదావరి బోర్డు భేటీ పై, ఏపీ ప్రభుత్వం పై చేసిన ఆరోపణలేవీ కొత్తవి కావు. గత పుష్కరకాలంగా రెండు రాష్ట్రాల మధ్య, బోర్డు సమావేశాల్లో ఉత్పన్నమవుతున్న టెక్నికల్ అభ్యంతరాలనే ఆయన మళ్లీ పాత చింతకాయ పచ్చడి మాదిరిగా ప్రకటనలు చేస్తున్నారు. గతంలో భారత రాష్ట్ర సమితి అధికారంలో ఉన్నప్పుడు ఏపీ ప్రభుత్వం ఎలాంటి అభ్యంతరాలు వ్యక్తం చేసిందో.. ఇప్పుడు కూడా అటువంటి సాంకేతిక అంశాలు తెరపైకి వచ్చాయి. దానిని రాజకీయంగా వాడుకోవాలని హరీష్ రావు చూస్తున్నారు. కేవలం తనపై వచ్చిన ఆరోపణలను కప్పిపుచ్చుకునేందుకు.. ఇలా డైవర్షన్ చేస్తున్నారు అనేది అధికార కాంగ్రెస్ పార్టీ చేస్తున్న వాదన.

**మళ్లీ సెంటిమెంట్ అస్త్రం..**

నీళ్ల రాజకీయాలతో మళ్లీ తెలంగాణలో సెంటిమెంటును రగిలించేందుకు హరీష్ రావు ప్రయత్నం చేస్తున్నారని అర్థం అవుతుంది. ఇటీవల హరీష్ రావు పై వ్యక్తిగత, రాజకీయ ఆరోపణలు వచ్చాయి. కొద్ది రోజుల కిందట సోషల్ మీడియాలో మిల్చి మిల్క్ కంపెనీలో బిజెపి నేతలతో ఉన్న భాగస్వామ్యం పై వార్తలు వచ్చాయి. దానికి సంబంధించిన వెబ్ సైట్ ని అర్ధాంతరంగా డౌన్ చేశారు. ఎంతవరకు దానిపై ఆయన నోరు విప్పలేదు. మరోవైపు ఇటీవల బ్లాక్ మ్యాజిక్ ఉదంతం పై విలేకరులు అడిగిన ప్రశ్నకు సైతం ఆయన సమాధానం చెప్పలేదు. నీళ్ల సెంటిమెంట్తో టాపిక్ డైవర్ట్ చేసేందుకు ప్రయత్నం చేశారు. ఆరోపణలు వచ్చిన ప్రతిసారి ప్రత్యక్ష ఆధారాలతో ఖండించే అలవాటు హరీష్ రావుకు ఉంది. కానీ ఇప్పుడు మాత్రం ఆయన మౌనంగా ఉండడం అనుమానాలకు బలం చేకూరుస్తోంది.

**డైవర్షన్ పాలిటిక్స్..**

హరీష్ రావు డైవర్షన్ పాలిటిక్స్ కు చిరునామా అని ప్రత్యర్థులు ఆరోపిస్తున్నారు. వ్యక్తిగత ఆరోపణలు, అక్రమ అప్పుల పంచాయితీలు, ఇతర పార్టీ నేతలతో తెరవ వెనుక ఉన్న వ్యాపార సంబంధాలు బయటపడిన ప్రతిసారి.. తెలంగాణ నీళ్లు, ఆత్మగౌరవం అంటూ ప్రెస్ మీట్ లు పెట్టి టాపిక్ డైవర్షన్ చేయడం భారత రాష్ట్ర సమితి ప్రతినిధులకు అలవాటైన విద్య అన్న విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రజాక్షేత్రంలో లేవనెత్తిన ప్రశ్నలకు పక్కా ఆధారాలతో వివరణ ఇవ్వకుండా.. సెంటిమెంట్ ముసుగులో దాగోవాలని ప్రయత్నం చేయడం మాత్రం ఎంత మాత్రం సమంజసం కాదు.

# గులాబీ బాస్ ఉదారత!

పెద్ది సుదర్శన్ రెడ్డి మృతి చెందిన సంగతి తెలిసిందే. ఆ కుటుంబానికి పార్టీ పరంగా ఏకంగా రూ. 2.25 కోట్ల భారీ ఆర్థిక సాయాన్ని అందించారు. తెలంగాణ ఉద్యమం నుంచి పార్టీకి, తనకు అత్యంత ఆప్తుడిగా ఉన్న నాయకుడి కుటుంబాన్ని అన్ని విధాల ఆదుకోవాలని కేసీఆర్ నిర్ణయించుకోవడం విశేషం.

**ఇద్దరి పిల్లల చదువుల కోసం..**

పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను ప్రత్యేకంగా పరామర్శించారు కేసిఆర్. ఆ కుటుంబానికి అన్ని విధాలుగా ఆదుకుంటామని ఇప్పటికే హామీ ఇచ్చారు కేటీఆర్. ఇప్పుడు స్వయంగా కేసీఆర్ వెళ్లి భారీ సాయాన్ని ప్రకటించడం విశేషం. అయితే ఈ సాయాన్ని కూడా పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యుల భవిష్యత్తు కోసం, వారి భద్రత కోసం ఈ మొత్తం జమ చేయనున్నారు. సుదర్శన్ రెడ్డి ఇద్దరు పిల్లల చదువు, భవిష్యత్తు అవసరాల కోసం వారిద్దరి పేర్ల మీద చెరో కోటి రూపాయల చొప్పున రెండు కోట్ల రూపాయలు డిపాజిట్ చేయనున్నారు. దీంతో పాటు వృద్ధాప్యంలో ఉన్న సుదర్శన్ రెడ్డి తల్లి అమృతమ్మ బాగోగులు, వైద్య ఖర్చుల నిమిత్తం ఆమె పేరు మీద మరో 25 లక్షల రూపాయలను బ్యాంకులో జమ చేయాలని భారత రాష్ట్ర సమితి నిర్ణయించింది.



**పార్టీ నేతలతో చర్చించి..**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో పార్టీకి విశేషమైన సేవలో అందించారు సుదర్శన్ రెడ్డి. అందుకే ఆ జిల్లా ముఖ్య నేతలతో సుదీర్ఘంగా చర్చించిన తరువాత కెసిఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ఆర్థిక సహాయంతో పాటు పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సంక్షేమానికి సంబంధించి బాధ్యత తీసుకోనున్నట్లు టిఆర్ఎస్ వర్గాలు వెల్లడించాయి. కేవలం ఆర్థిక సాయంతోనే సరిపెట్టకుండా.. పిల్లల విద్యాభ్యాసం, ఇతర కుటుంబ సంక్షేమాన్ని నిరంతరం పర్యవేక్షిస్తూ పార్టీ వెన్నుదన్నుగా నిలుస్తుందని కేసీఆర్ భరోసా ఇచ్చారు.

**ఉద్యమ నాయకుడిగా..**

తెలంగాణ ఉద్యమం నుంచి క్రియాశీలకంగా వ్యవహరిస్తూ వచ్చారు పెద్ది సుదర్శన్ రెడ్డి. నర్సంపేట ఎమ్మెల్యేగా నియోజకవర్గానికి ఎనలేని సేవలు అందించారు. అతని మరణం పార్టీకి సైతం తీరని లోటు అని భావిస్తున్నారు ఆ పార్టీ నేతలు. అయితే కష్టకాలంలో ఉన్న ఉద్యమ నాయకుడి కుటుంబానికి ఏకంగా భారీ సహాయం ప్రకటించడం ద్వారా భారత రాష్ట్ర సమితి నాయకత్వం తమ పార్టీ శ్రేణుల విషయంలో ఎంత ఉదారంగా వ్యవహరిస్తుందో అర్థం అవుతోందని ఆ పార్టీ వర్గాలు వ్యాఖ్యానిస్తున్నాయి. అయితే మిగతా పార్టీలకు ధీటుగా.. కష్టంలో ఉన్న పార్టీని ఆదుకోవడంలో ప్రత్యేకతను చాటుకుంది గులాబీ పార్టీ.




# పథకాల పండుగ

(మొదటి పేజీ తరువాయి)

ఫైలేరియా, డయాలసిస్, బీడీ రేకేదార్లకు ప్రభుత్వం ప్రతినెలా పెన్షన్ అందిస్తోంది. వీరితోపాటు తాజాగా తలసీమియా, సికిల్ సెల్ ఎనిమియా బాధితులకు కూడా పింఛన అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. కొత్త పింఛన్ల మంజూరు కోసం దరఖాస్తుల ప్రక్రియను ప్రారంభించనున్నారు. ఒంటరి మహిళలు, వితంతువులు సహా మరో 9 రకాల కేటగిరీల్లోని వారికి ప్రాధాన్య క్రమంలో పింఛన్లను మంజూరు చేయాలని నిర్ణయించారు. ఇందుకు సంబంధించి సర్క్యులర్ జారీ అయిన వెంటనే అధికారులు దరఖాస్తులను స్వీకరించనున్నారు. ఇక స్మార్ట్ రేషనకార్డులతో మరో ఐదు లక్షల కుటుంబాలకు సిలిండర్ పథకం అందుబాటులోకి వస్తుంది. కొత్తగా అర్హులను ఖరారు చేసే క్రమంలో ఆర్థిక పరమైన అంశాలపై ప్రభుత్వం దృష్టి సారించిందని, సంబంధిత ఫైలు ఆర్థిక శాఖకు చేరిందని సమాచారం. గృహజ్యోతి పథకం కింద 200 యూనిట్ల ఉచిత విద్యుత సాయం 50 లక్షల కుటుంబాలకు అందుతోంది. కొత్తగా రేషన కార్డులు అందుకుంటున్న వారిలో 3-4 లక్షల కుటుంబాలు ఉచిత విద్యుత లబ్ధిదారులుగా మారే అవకాశం ఉంది.



సంగారెడ్డి జిల్లా నుంచి కార్డుల పంపిణీ ప్రారంభం

గత రెండున్నరేళ్లలో రాష్ట్ర ప్రభుత్వం 16.32 లక్షల కొత్త రేషనకార్డులను మంజూరు చేసింది. దాంతో 61.09 లక్షల మంది ఆహార భద్రత పథకం పరిధిలోకి వచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో 1.05 కోట్ల రేషన కార్డులు ఉన్నాయి. దాంతో 3.42 కోట్ల మందికి ఆహార భద్రత లభిస్తుంది. ప్రభుత్వం సురక్షితమైన, ట్యాంపర్ ప్రూఫ్ ల్యామినేటెడ్ స్మార్ కార్డులను అందించనుంది. ఆగస్టు 15న సంగారెడ్డి జిల్లా నుంచి సీఎం రేవంత్ ఈ కార్డుల పంపిణీని ప్రారంభిస్తారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా కార్డులు లబ్ధిదారులకు అందజేస్తారు. గిగ్ వర్కర్ల భద్రత కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా చట్టాన్ని తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ఈ చట్టాన్ని ఆగస్టు 15 నుంచి అమలు చేయడానికి అవసరం అయిన మార్గదర్శకాలకు ఆగస్టు 15 లోగా ప్రకటించి, అమల్లోకి తెస్తారు. మరోవైపు కొన్ని అభివృద్ధి పథకాలను కూడా ఆగస్టు 15న ప్రారంభించనున్నారు. సనతనగర్ టిమ్స్ అందులో ప్రధానమైనది. ఉస్మానియా ఆసుపత్రి, నిమ్స్ కొత్త భవనాల పనులు త్వరగా పూర్తయ్యేలా చర్యలు తీసుకుంటున్నారు. మూసీ పునరుజ్జీవనానికి సంబంధించి రుణ సేకరణ వ్యవహారాలు పూర్తవ్వడంతో ప్రభుత్వం ఆ పనులపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. ఇందులో కీలకమైన గాంధీ సరోవర్ నిర్మాణం పైనా ప్రత్యేకంగా శ్రద్ధ వహిస్తోంది.

# వికలాంగులకు 'కృత్రిమ' చేయూత

## మణికొండలో 25 మందికి కృత్రిమ అవయవాల అమరిక.. 150 మందికి భోజన వసతి





**గండిపేట(క్రైమ్ మిర్రర్):** వికలాంగుల జీవితాల్లో కొత్త వెలుగులు నింపేందుకు మణికొండలో మానవతా కార్యక్రమం నిర్వహించారు. భారత్ వికాస్ పరిషత్, సీనియర్ సిటిజన్ సొసైటీ ఆఫ్ మణికొండ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 25 మంది వికలాంగులకు కృత్రిమ అవయవాలను అమర్చారు. అనంతరం సుమారు 150 మందికి భోజన వసతి కల్పించారు. ఈ సందర్భంగా సీనియర్ సిటిజన్ సొసైటీ ఆఫ్ మణికొండ జనరల్ సెక్రటరీ రఘు సతీష్ కుమార్ మాట్లాడుతూ వికలాంగులకు కృత్రిమ అవయవం అందించడం కేవలం ఒక పరికరం ఇవ్వడం కాదని అన్నారు. ఒక వ్యక్తికి మళ్లీ నడిచే అవకాశం.. కుటుంబానికి ఆశ.. వ్యక్తికి ఆత్మవిశ్వాసం కల్పించడం అని పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా వైస్ ప్రెసిడెంట్ కొడకండ్ల నరేందర్ రెడ్డి మాట్లాడుతూ శారీరక వైకల్యం ఉన్నప్పటికీ వారి ధైర్యం, పట్టుదల, ప్రతిభను ఎవరూ అడ్డుకోలేరన్నారు. వైకల్యం ఒక మనిషి సామర్థ్యానికి కొలమానం కాదని చెప్పారు. మణికొండ బీజేపీ అధ్యక్షుడు రవికాంత్ రెడ్డి మాట్లాడుతూ వికలాంగులను జాలితో కాకుండా గౌరవంతో చూడాలని సూచించారు. వారికి విద్య, ఉపాధి, స్వయం ఉపాధి అవకాశాలతో పాటు ప్రజా ప్రదేశాల్లో అవసరమైన సౌకర్యాలు కల్పించాల్సిన బాధ్యత సమాజంపై ఉందన్నారు. రంగారెడ్డి జిల్లా మహిళా వైస్ ప్రెసిడెంట్ ఇందిరా రెడ్డి మాట్లాడుతూ వికలాంగులకు మనం ఏం చేయగలమో ఆలోచించి ముందుకు రావాలన్నారు. చిన్న సహాయం, అవసరమైన సమాచారం, ఉద్యోగ అవకాశం లేదా వారి ప్రతిభకు ప్రోత్సాహం ఇవ్వడం ద్వారా వారి జీవితంలో పెద్ద మార్పు తీసుకురావచ్చని అన్నారు. రఘు సతీష్ కుమార్ మాట్లాడుతూ కృత్రిమ అవయవాలు పొందిన వారు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించారు. మీకు వైకల్యం ఉంది.. కానీ మీకు పరిమితులు లేవు. మీ మీద మీకు నమ్మకం పెట్టుకుని జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలి అని పిలుపునిచ్చారు. మీరు ఒక్క అడుగు ముందుకు వేస్తే మీ వెనుక కుటుంబం ఉంటుంది. కుటుంబం వెనుక సమాజం ఉంటుంది. సమాజం వెనుక మనందరి సహకారం ఉంటుంది అని అన్నారు. వికలాంగులు సమాజానికి భారమేమీ కాదు.. సమాజంలో సమాన భాగస్వాములు" అని పేర్కొన్నారు. ఆల్ కాలనీస్ వైస్ ప్రెసిడెంట్ రాజశేఖర్ మాట్లాడుతూ కృత్రిమ అవయవాలు పొందిన ప్రతి ఒక్కరి జీవితంలో కొత్త వెలుగు రావాలని ఆకాంక్షించారు. వారు ఆరోగ్యంగా, ఆనందంగా, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని కోరుకున్నారు. సీనియర్ సిటిజన్ ఫౌండర్ రామానుజన్ కవితా భావంతో సందేశాన్ని వినిపించారు. జిజాబాయి బ్రాంచ్ అధ్యక్షుడు పెంటా రెడ్డి మాట్లాడుతూ.. రఘు సతీష్ కుమార్ స్వార్థాన్ని పక్కనపెట్టి సొంత నిధులతో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బీవీపీ రీజనల్ జాయింట్ సెక్రటరీ నాగరాజు, సంపర్క్ కన్వీనర్ సదాశివ రెడ్డి, కార్యదర్శి వినోద్, బీరప్ప, సిద్ధప్ప, రాజేష్, మధు, వెంకటాచారి, శివకుమార్, సీనియర్ సిటిజన్ అధ్యక్షుడు ప్రభుజీ, మహిళా సంపర్క్ సత్యవతి, కమల కుమారి, హరిప్రియ తదితరులు పాల్గొన్నారు. ప్రభుజీ ఆహ్వానితులను వేదికపైకి ఆహ్వానించారు. భారత్ వికాస్ ట్రస్ట్ సహకారంతో, సీనియర్ సిటిజన్ సభ్యులు సమకూర్చిన నిధులతో 25 మంది వికలాంగులకు కృత్రిమ అవయవాలు అమర్చారు. కార్యక్రమం అనంతరం సుమారు 150 మందికి భోజన వసతి కల్పించారు. వికలాంగుడికి చేయూతనివ్వడం అంటే కేవలం అతని అడుగులకు బలం ఇవ్వడం కాదు.. అతని జీవితానికి దిశ చూపడం అని రఘు సతీష్ కుమార్ అన్నారు.

# నేనేం బాబా బాగేశ్వర్‌ను కాదు, కానీ..!:

ఈ సందర్భంగా ఆయన మధ్యప్రదేశ్‌కు చెందిన ప్రముఖ ఆధ్యాత్మిక గురువు బాబా బాగేశ్వర్ (ధీరేంద్ర కృష్ణ శాస్త్రి) పేరును ప్రస్తావించి సభలో నవ్వులు పూయించారు. విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ, వారి మనసులోని ఆలోచనలను సరదాగా ఊహించి చెప్పారు."మీరంతా ఈ రోజు ఇక్కడ సమావేశమయ్యారు. కానీ, మీ మనసుల్లో ఎన్నో ఆలోచనలు మెదులుతూ ఉంటాయి. నేనేం బాబా బాగేశ్వర్‌ను కాదు, కానీ మీ మదిలో ఏముందో ఊహించగలను. కొందరు భవిష్యత్తు గురించి, మరికొందరు జీతాల గురించి, ఇంకొందరు కొత్త నగరంలో కొత్త జీవితం గురించి, మరికొందరు స్టార్టప్‌ల గురించి ఆలోచిస్తుండవచ్చు" అని మోదీ వ్యాఖ్యానించడంతో విద్యార్థులు, అధ్యాపకులు చప్పట్లతో హర్షం వ్యక్తం చేశారు. ఈ వేడుకలో 3,000 మందికి పైగా విద్యార్థులకు డిగ్రీలు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మోదీ మాట్లాడుతూ.. "ఈ రోజు మీ కుటుంబ సభ్యులు ఎంత గర్వపడుతున్నారో, నేను కూడా మీ గురించి అంతే గర్విస్తున్నాను. మీరు కేవలం డిగ్రీలు అందుకోవట్లేదు, దేశం కోసం ఏదైనా సాధించాలనే కలను ముందుకు తీసుకెళుతున్నారు" అని విద్యార్థులను అభినందించారు. ప్రతి ఒక్కరి మార్గం, కలలు వేర్వేరుగా ఉన్నప్పటికీ, ఐఐటీలో చేరిన మొదటి రోజు నుంచి ఈ స్నాతకోత్సవం వరకు సాగిన ప్రయాణం ప్రతి ఒక్కరిలో సంతృప్తిని నింపుతుందని ఆయన అన్నారు.ఈ కార్యక్రమంలో భాగంగా అకడమిక్స్‌లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రెసిడెంట్స్ గోల్డ్ మెడల్, డైరెక్టర్స్ గోల్డ్ మెడల్ వంటి ప్రతిష్ఠాత్మక పురస్కారాలను ప్రధాని ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన సరదాగా స్పందిస్తూ.. "ప్రతిభావంతులైన విద్యార్థుల్లో కొంతమంది ఆడపిల్లలు ఉంటే బాగుండేది. క్షమించాలి, కొందరు కాదు, చాలామంది ఉండాలి" అని వ్యాఖ్యానించడంతో సభలో మరోసారి నవ్వులు విరిశాయి.అనంతరం ఐఐటీ సోనిపట్ క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన 'పరం ప్రజ్ఞ' అనే ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధారిత హై-పెర్ఫార్మెన్స్ సూపర్ కంప్యూటింగ్ కేంద్రాన్ని ప్రధాని వర్చువల్‌గా ప్రారంభించారు. ఈ సదుపాయం ఏఐ, డేటా సైన్స్, అడ్వాన్స్‌డ్ కంప్యూటింగ్ రంగాల్లో ఐఐటీ సామర్థ్యాన్ని మరింత బలోపేతం చేస్తుందని భావిస్తున్నారు. జీవితంలో వెనక్కి తిరిగి చూసుకున్నప్పుడు క్యాంపస్ జీవితం, స్నేహితులు, గురువులు ఎప్పటికీ గుర్తుండిపోతారని మోదీ విద్యార్థులకు సూచించారు.

# సీతారామ నీళ్లను నిర్వాసితులకే అందించాలి

## బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుకూరి రమేష్

భద్రాద్రి కొత్తగూడెం,ఆగస్టు8: భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని వర్షాధార సాగు భూములకు ప్రాణాధారమైన సీతారామ ఎత్తిపోతల పథకం నీళ్లను ముందుగా స్థానిక భూ నిర్వాసితులకే మళ్లించాలని, స్థానిక అవసరాలు తీర్చకుండా ఇతర ప్రాంతాలకు తరలించడం సరికాదని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు చిలుకూరి రమేష్ అన్నారు. జూలూరుపాడు మండల కేంద్రంలో శనివారం జరిగిన బీజేపీ కిసాన్ మోర్చా ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ?గోదావరి జలాలు తమ పొలాలకు మళ్లుతాయనే ఆశతో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతులు సీతారామ ప్రాజెక్టు నిర్మాణానికి తమ విలువైన భూములను త్యాగం చేశారన్నారు. ఎటువంటి ముందస్తు అనుమతులు లేకుండా గత రెండు నెలలుగా ఈ ప్రాంత రైతులకు నీళ్లు అందించకుండా నాగార్జునసాగర్ కాలువల్లోకి జలాలను తరలించడం పట్ల తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. నీటి ఎద్దడి ఉన్న స్థానిక ప్రాంతాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందించిన తర్వాతే మిగులు జలాలను ఇతర ప్రాంతాలకు తీసుకెళ్తే తమకు ఎలాంటి అభ్యంతరం లేదన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా రైతులపై నిజమైన ప్రేమ ఉంటే, తక్షణమే ఉన్నతాధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేయాలని కోరారు. ?సీతారామ ప్రాజెక్టు భూసేకరణ కింద నిర్వాసితులైన రైతులకు ఎకరానికి రూ.21 లక్షల చొప్పున నిధులు కేటాయించి చెల్లించాలని, సాగునీరు అందక నష్టపోయిన రైతులకు తక్షణమే పంట నష్ట పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే అవకాశం ఉన్న ప్రతి చెరువుకూ సీతారామ జలాలను తక్షణమే విడుదల చేయాలని, రాబోయే రబీ సీజన్ నాటికి జిల్లాలోని ప్రతి వ్యవసాయ భూమికీ సాగునీరు అందేలా స్పష్టమైన కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ?మరోవైపు కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం రైతాంగ సంక్షేమానికి పెద్దపీట వేస్తోందని, ఎరువుల సబ్సిడీ రూపంలో లక్షల కోట్లు భరిస్తూ ఒక్కో బస్తాపై సుమారు రూ.2,000 వరకు వెసులుబాటు కల్పిస్తోందని తెలిపారు. అయితే, కనీసం బస్తాకు అయ్యే రూ.20 నుండి రూ.30 రవాణా ఛార్జీలను కూడా రాష్ట్ర ప్రభుత్వం భరించకపోవడం శోచనీయమని, ఆ రవాణా ఛార్జీలను తక్షణమే రాష్ట్ర ప్రభుత్వమే చెల్లించాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో బీజేపీ కిసాన్ మోర్చా జిల్లా ఉపాధ్యక్షుడు మాదినేని సతీష్, మండల అధ్యక్షులు బుక్యా రమేష్, నాయకులు సిరిపురపు ప్రసాద్, తెల్లం నరసింహారావు, మండల ప్రధాన కార్యదర్శి నిమ్మటూరి రామారావు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు సిరిపురపు పుల్లారావు, బయ్యవరపు వెంకటేశ్వర్లు, కృష్ణ పాల్గొన్నారు.



# తెలంగాణ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఎంప్లాయిస్ నాలుగవ మహాసభ

**క్రైమ్ మిర్రర్ ఖమ్మం ఆగస్టు 08:** ఖమ్మం లో తెలంగాణ కోపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఎంప్లాయిస్ అసోసియేషన్ ఖమ్మం జిల్లా యూనిట్ యొక్క నాలుగో మహాసభ గ్రాండ్ గాయత్రి హోటల్ నందు ఘనముగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టిసిసిబిఇఏ రాష్ట్ర అసోసియేషన్ చైర్మన్ కనకం జనార్దన్ రావు, రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్.కె అలీముద్దీన్, చీఫ్ వైస్ ప్రెసిడెంట్ పాశం నాగేందర్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి ప్రవీణ్ కుమార్ పాల్గొనడం జరిగింది. ఈ సమావేశంలో రాబోయే మూడు సంవత్సరాలకు ఖమ్మం జిల్లా యూనిట్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకొనడం జరిగింది. జిల్లా ప్రెసిడెంట్ గా ఇ. శాంతిరాగమయి, జిల్లా కార్యదర్శిగా ఎం రామకృష్ణ, ట్రెజరర్ గా ఎన్ నాగేంద్రప్రసాద్ ను ఎన్నుకొనుట జరిగింది. ఈ సమావేశంలో కొన్ని నిర్ణయాలు తీసుకొనుట జరిగింది. సహకార బ్యాంకింగ్ రంగంలో రెండింతల విధానాన్ని ప్రవేశపెట్టాలని, పెన్షన్ సౌకర్యాన్ని కల్పించాలని కోరడం జరిగింది. ఈ కార్యక్రమానికి జిల్లా నలుమూలల నుండి కోపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ ఎంప్లాయిస్ బ్యాంక్ ఉద్యోగులు అందరూ పాల్గొనడం జరిగింది.

# 17 నుంచి ఎపి శాసనభ సమావేశాలు

అమరావతి,ఆగస్ట్8: ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు ఈ నెల 17వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. 17వ తేదీన ఉదయం 10 గంటలకు శాసన మండలి మొదలు కానుంది. ఈ మేరకు ఏపీ గవర్నర్ అబ్దుల్ నజీర్ శనివారం నోటిఫికేషన్ విడుదల చేశారు. శాసనసభ, శాసనమండలి సెషన్ సమావేశానికి అధికారిక నోటిఫికేషన్ జారీ చేశారు. నాలుగు రోజుల పాటు 50వ వర్షాకాల సమావేశాలు జరిగే అవకాశాలు ఉన్నాయి. 17వ తేదీ ఉదయం 9 గంటలకు ఏపీ అసెంబ్లీ సమావేశాలు మొదలవుతాయని నోటిఫికేషన్‌లో గవర్నర్ పేర్కొన్నారు. 17వ తేదీ ఉదయం 10 గంటలకు శాసన మండలి సమావేశాలు ప్రారంభమవుతాయని వెల్లడించారు. 17వ తేదీ ఉదయం ఉభయ సభల బీఏసీలు సమావేశం కానున్నాయి. సమావేశాలు ఎన్ని రోజులు జరగాలి, అజెండాను ఉభయ సభల బీఏసీలు ఖరారు చేయనున్నాయి.



# బొద్దింకల వేటలో రాహుల్!

**బొ**ద్దింకలను బుట్టలో వేసుకోవడమెలా? ఇప్పుడు ఇదే ఆలోచనతో కాంగ్రెస్ అప్రకటిత అగ్రనేత రాహుల్ గాంధీ తన ప్రయత్నంలో తను ఉన్నారని చెప్పాలి. బొద్దింకలకు మద్దతుగా ఆయన కార్యక్రమాలు చేస్తున్నారు. నిజానికి ఈ బొద్దింకల వెనక కాంగ్రెస్ పార్టీ కూడా ఉందన్న టాక్ ఒకటి రాజధానిలో చక్కర్లు కొడుతోంది. మోడీని పడగొట్టాలంటే రాహుల్‌తో కావడం లేదు. ఆయన జనం దగ్గర పెద్దగా ప్రతిష్టను సంపాదించలేకపోయారు. యూపిఏ ప్రభుత్వం ఓడినప్పటి నుంచి నానా కష్టాలు పడ్డా లాభం లేకుండా పోతోంది. రాజ్యాంగం ప్రమాదంలో పడిందని, రిజర్వేషన్లు ఎత్తేస్తారని బాగా ప్రచారం చేయడంతో గత పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ కొంత పుంజుకుంది. అయితే ఇది రాహుల్ నాయకత్వాన్ని పుంజుకునేంతగా మాత్రం కాదు. ఇప్పుడు ఇటీవల దేశంలో ఓ కుదుపు కుదిపిన బొదింకలను బుట్టలో వేసుకునే ప్రయత్నం లో ఉన్నారు. వారి ఆందోళనకు మద్దతుగా పార్లమెంట్‌లో పోరాడుతున్నారు. అలాగే వారితో కలసి పని చేసేందుకు ఉత్సాహ పడుతున్నారు. ఇటీవల ఉద్యమంలో పాల్గొన్న కొందరు విద్యార్థులతో కలసి మీడియా ముందుకు వచ్చారు. ప్రయాగ్ రాజ్‌లో జెన్‌జీలతో కలసి ఆందోళనకు పిలుపునిచ్చారు. ఇవన్నీ కూడా ఓ క్రమపద్ధతిలో మోడీని ఢీకొనేందుకు చేస్తున్న ప్రయత్నాలుగా గుర్తించాలి. తాజాగా రైతులు కూడా మళ్లీ రోడ్డెక్కబోతున్నారు. ఈ ఇద్దరిని కలిపితే వాలిలా తన బలం కూడా పెరుగుతుందని భావిస్తున్నట్లుగా ఉంది. ఇకపోతే ఇటీవల రాహుల్ తన ఆహార్యాన్ని కూడా మార్చారు. జీన్స్, టి షర్ట్‌తోనే ఎక్కువగా కనిపిస్తున్నారు. ఖద్దరు బట్టలను ఉత్తికి అవతల పడేశారు. యువతరం మనసులో ఏముందో గుర్తించి అందుకు అనుగుణంగా పార్టీ విధానాలు, నినాదాలను సవరించుకుంటేనే భవిష్యత్తు ఉంటుందని భావిస్తున్నారు. తమిళనాడు ఎన్నికల ఫలితందీనిని రుజువు చేస్తోంది. ఎన్నికలు రాగానే సరికొత్త సంక్షేమ పథకాలను ప్రకటించి ఓటర్లకు డబ్బు పంచితే చాలన్న భావన ఇప్పటివరకు ఉండేది. తమిళనాడు ఎన్నికలు ఇందుకు భిన్నంగా ఫలితాలను ఇచ్చాయి. టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ డబ్బు పంచకుండాఇ, పెద్దగా ప్రకటనలు చేయకుండా ద్రవిడ పార్టీలను దెబ్బతీసారు. తమిళనాడులో యువతను ఆకట్టుకోవడం ద్వారా విజయ్ అధికారంలోకి వచ్చారు. విజయ్ కూడా ద్రవిడ పార్టీలతో పోటీపడి సంక్షేమ పథకాలు ప్రకటించినా ప్రజలు వాటి గురించి పట్టించుకోలేదు. నిజానికి నేటి తరానికి చెందిన యువత కేవలం సంక్షేమ పథకాలను మాత్రమే కోరుకోవడం లేదు. ప్రభుత్వంలో జవాబుదారీతనం కోరుకుంటున్నారు. ఢిల్లీ నుంచి గల్లీ దాకా వివిధ స్థాయిల్లో జవాబుదారీతనం ఇప్పుడు లోపించింది. అధికార దుర్వినియోగం పెచ్చరిల్లింది. పాలకులు విలాసాలు పెరిగాయి. ప్రభుత్వాలలో ఏ స్థాయిలో కూడా జవాబుదారీతనం కనిపించడం లేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఏ ఒక్క ఫైలు కూడా దానంతట అది కదిలే పరిస్థితి లేదు. లంచం ఇవ్వనిదే కాగితం కదలని పరిస్థితి. ఈ కారణంగానే ఈ దేశ యువతలో ఆశలు, ఆకాంక్షలతో పాటు



నిరాశా నిస్పృహలు చోటుచేసు కుంటున్నాయి. అందుకే అవకాశం రాగానే మార్పును ఆహ్వానిస్తున్నారు. పరీక్షా పేపర్ల లీక్ విషయంలో మోడీ ప్రభుత్వం నిర్లక్ష్యంగానే వ్యవహరించింది. తాము చేసే పనులే మంచివనే పరిస్థితికి మోడీ వచ్చేశారు. అందుకే ఆయన ప్రజల గుండెచప్పుడు వినలేకపోతున్నారు. జెన్‌జీలంతా బొద్దింకల రూపంలో నిరసనలు తెలపడంతో కొంత సర్దుకున్నా, పూర్తిగా సర్దుకునేందుకు సిద్ధం కావడం లేదు. దీన్ని అవకాశంగా తీసుకుని రాహుల్ దూకుడు ప్రదర్శిస్తున్నారు. అందుకే దేశంలోని రాజకీయ పార్టీలు బొద్దింకల పేరు ఎత్తగానే భయపడుతున్నాయి. నిన్నటి తరం ఆలోచనలతో, పాత చింతకాయ పచ్చడి విధానాలతో నడుస్తున్న పార్టీలకు ఎన్నికలలో నవతరం నుంచి ప్రతిఘటన ఎదురవుతోంది. యువతరంలో ఆశలు,ఆకాంక్షలు పెరుగుతున్న సమయంలోనే నిరాశా నిస్పృహలు కూడా వారిని కమ్మేస్తున్నాయి. బొద్దింకల ఢిల్లీ ఆందోళన ఇందుకు తాజా ఉదాహరణ. ఈ బొద్దింకలను పట్టేస్తే..మనకు తిరుగు లేదని అందరూ ఆలోచన చేస్తున్నారు. రాహుల్ గాంధీ ఓ అడుగు ముందుకు వేసి వారికి మద్దతుగా పోరాట పంథా అవలంబిస్తున్నారు. పార్లమెంట్ లోపలా, బయటా ఇప్పుడు, విద్యార్థులు, యువత గురించి గట్టిగా మాట్లాడు తున్నారు. యవతరంతో కనెక్ట్ కాని పార్టీలు మెల్లగా తెరమరుగవుతాయని గుర్తించారు. ప్రధాని మోదీ కూడా సామాజిక మాధ్యమాల్లో యువతరం వెలిబుచ్చుతున్న అభిప్రాయాలను ఎప్పటికప్పుడు తెలుసుకొని తదనుగుణంగా వ్యూహాలు రూపొందించుకోవాలని పార్టీ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ ఘూవత్ కూడా ఇదే విషయాన్ని ప్రకటించారు. స్వాతంత్ర్య సంగ్రామాన్ని ముందుండి నడిపించిన కాంగ్రెస్ పార్టీ... ఆ తర్వాత దేశాన్ని సుదీర్ఘ కాలం పరిపాలించింది. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నుంచి లాల్‌బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, పీవీ నరసింహారావు, మన్మోహన్‌సింగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రధానమంత్రులుగా పనిచేశారు. కాంగ్రెస్ నాయకుల పెడ ధోరణులు కారణంగా నేటి తరానికి దూరం అయ్యారు. పార్టీని ఎప్పటికప్పుడు యువతతో కనెక్ట్ చేసుకునే పనిని కాంగ్రెస్ నాయకులు చేయలేదు. విధానాలను, ఆలోచనలను సవరించుకొని నవీకరించుకోవడంలేదు. డెబ్బై అయిదేళ్లు పైబడిన ప్రధాని నరేంద్ర మోదీ ఈ దేశం యువతతో కనెక్ట్ అవుతుండగా... వయసులో చిన్నవాడైన రాహుల్‌గాంధీ యువతను ఆకట్టుకోలేకపోయారు. ఆలస్యంగా అయినా ఇప్పుడు రాహుల్ యువత గురించి ఆలోచి స్తున్నారు. అయితే బొద్దింకల పార్టీ రాజకీయాలకు దూరంగా ఉండాలని నిర్ణయించింది. కేవలం ప్రెజర్ గ్రూపుగా పనిచేస్తామని అభిజిత్ దీప్కే ప్రకటించారు. ఈ క్రమంలో రాహుల్ బుట్టలో పడతారా లేక సొంతగా తమ ఆధిపత్యాన్ని కొనసాగిస్తారా అన్నది ముమ్ముందు తేలనుంది. ఓ వైపు రాజ్యాంగం బుక్, మరోవైపు బొద్దింకల ఎజెండాతో ముందుకు సాగడం ద్వారా జాతీయ స్థాయిలో విజయం సాధించి అధికారం చేపట్టాలన్న లక్ష్యంతో రాహుల్ సాగుతున్నారు.

# నిశ్శబ్దం తటస్థత కాదు... అధర్మానికి పరోక్ష మద్దతు!

**రాజసభ నడుమ ఒక స్త్రీకి ఘోరమైన అవమానం జరుగుతోంది. తన మానప్రాణాలను కాపాడుకోవడానికి ఆమె దైన్యంగా కేకలు వేస్తోంది. చుట్టూ ఉన్నవారు భీష్ముడు, ద్రోణాచార్యుడు, కృపాచార్యుడు, ధృతరాష్ట్రుడు వంటి మహామహులు. జ్ఞానంలో, పరాక్రమంలో, సామాజిక హోదాలో అందరికన్నా గొప్పవారు. కానీ వారు ఆ సమయంలో ఏం చేశారు? కేవలం తల దించుకుని మౌనంగా కూర్చుండిపోయారు.**



ఈ ఒక్క ఘోర దృశ్యం మహాభారతంలో అత్యంత భయంకరమైన ప్రశ్నను మన ముందుకు తెస్తుంది. విస్తారమైన జ్ఞానం ఉండి, అపారమైన శక్తి ఉండి, పరిపాలనా అధికారం ఉండి కూడా కళ్ళెదుట జరుగుతున్న అన్యాయాన్ని చూస్తూ మౌనంగా ఉండడం క్షమించరాని నేరం కాదా? ఈ నైతిక ప్రశ్నకు మహాభారతం ఇచ్చిన స్పష్టమైన సమాధానం ఈనాటికీ మన మానవ సమాజాన్ని తీవ్రంగా కుదిపేస్తోంది.

కురుసభలో దుశ్శాసనుడు ద్రౌపదిని జుట్టు పట్టుకుని ఈడ్చుకొచ్చినప్పుడు, ఆమె కంటినీటితో ఇక్కడ ధర్మం ఎక్కడ ఉంది? అని సభను గట్టిగా ప్రశ్నించింది. ఆమె నిలదీసిన ప్రశ్న అక్కడ ఉన్న ప్రతి ఒక్కరి గుండెలను తాకింది, కానీ ఎవరూ ముందుకు రా లేదు. భీష్ముడు సాంకేతిక ధర్మసూక్ష్మాలను వల్లించాడే తప్ప, ధైర్యంగా లేచి ఆమెను రక్షించే ప్రయత్నం చేయలేదు. ద్రోణాచార్యుడు, తన శిష్యుల న్యాయాన్యాయాలు సంపూర్ణంగా తెలిసినవాడైనా, పెదవి విప్పి మాట్లాడలేదు. కేవలం విదురుడు ఒక్కడే భయపడకుండా గొంతెత్తి హెచ్చరించాడు, కానీ అతని మాటను ఆలకించే నాథుడే లేకుండా పోయాడు. ఇక్కడ మహాభారతం చాలా స్పష్టంగా ఒక సత్యాన్ని చెబుతోంది. అన్యాయం జరుగుతున్నప్పుడు చూస్తూ మౌనం వహించడం అనేది, ఆ అన్యాయం చేసేవారితో సమానమైన పాపమే అవుతుంది. ఎందుకంటే మౌనంగా ఉండడం అనేది ఒక తటస్థ స్థానం కాదు, అది అక్రమానికి పరోక్షంగా ఇచ్చే మద్దతు మాత్రమే. స్వధర్మం ఏమిటో స్పష్టంగా తెలిసి కూడా దానిని నెరవేర్చకపోవడం, తెలియక తప్పు చేసే వాడి కన్నా చాలా పెద్ద నేరమని భగవాన్ శ్రీకృష్ణుడు తర్వాత భీష్ముడితో నేరుగా తేల్చి చెబుతాడు.


కురుసభలో ఆ రోజు రాజులు పాటించిన మౌనం ఒక్క రోజుతో ముగిసిపోలేదు. ఆ నిశ్శబ్దమే పద్దెనిమిది అక్షౌహిణుల భారీ సైన్యాన్ని బలిగొన్న కురుక్షేత్ర మహాసంగ్రామానికి ప్రధాన బీజం వేసింది. భీష్ముడు, ద్రోణుడు వంటి మహాయోధులు తమ సమకాలీన మౌనానికి శరపంజరంపై ప్రాణాలు కోల్పోవడం ద్వారా చివరికి మూల్యం చెల్లించవలసి వచ్చింది. భీష్ముడు తన తుదిశ్వాస విడిచే దశలో, తాను నాడు సభలో మౌనంగా ఉండటమే తన జీవితంలో చేసిన అతిపెద్ద పాపమని తీవ్రంగా పశ్చాత్తాపపడతాడు. ఇది కేవలం పాత కాలపు పురాణ కథ మాత్రమే కాదు. ఇది తరతరాలకూ వర్తించే ఒక శాశ్వత నైతిక సూత్రం. శక్తి ఉండి కూడా కళ్ళ ముందటి అన్యాయాన్ని ఆపకపోతే, ఆ శక్తే చివరికి పెద్ద శాపంగా మారుతుంది. పురాణాల నాటి ఆ మహాభారత హెచ్చరిక ఈనాటి ఆధునిక జీవన విధానానికి కూడా అక్షరాలా వర్తిస్తుంది. ఒకసారి మన చుట్టూ జరుగుతున్న పరిస్థితులను లోతుగా ఆలోచించండి. బహిరంగ వీధిలో ఒక మహిళపై వేధింపులు జరుగుతున్నప్పుడు, మనకెందుకులే ఈ రచ్చ అని తప్పుకుపోయే పౌరులము మనం భీష్ముడిలా వ్యవహరించడం లేదా? కార్పొరేట్ కార్యాలయంలో అన్యాయంగా ఒక ఉద్యోగిని అవమానిస్తున్నప్పుడు, ఉద్యోగం ఎక్కడ పోతుందో అని భయపడి నోరు మెదపని ఉద్యోగులు ద్రోణాచార్యుడిలా ప్రవర్తించడం లేదా? వ్యవస్థలో అవినీతిని కళ్ళారా చూస్తూ, నాకేం సంబంధం లేదు అనుకునే ప్రతి సాధారణ పౌరుడూ ఆనాటి కురుసభలో కూర్చున్న మౌన సాక్షిలానే వ్యవహరిస్తున్నాడు. పాఠశాలలో, కుటుంబంలో, సమాజంలో చిన్న పిల్లలపై, మహిళలపై జరుగుతున్న అనేక వేధింపులను చూసి కూడా మనం ఎందుకు ఇందులో జోక్యం చేసుకోవాలి అని భావించే ప్రతి మనస్సు ఆధునిక కురుసభకు సజీవ ప్రతిరూపమే. అంతేకాకుండా, సోషల్ మీడియా యుగంలో అబద్ధాలు, ద్వేషపూరిత ప్రచారాలు వేగంగా వ్యాపిస్తున్నప్పుడు, అసలు నిజం తెలిసినా మనకెందుకులే ఈ వివాదం అని మౌనంగా స్క్రీన్ స్క్రోల్ చేసుకుంటూ వెళ్లిపోయే ప్రతి ఒక్కరూ, తమకు తెలియకుండానే ఆ అబద్ధానికి మరింత బలాన్ని చేకూరుస్తున్నారు. నా ఒక్కడి మౌనం వల్ల సమాజానికి ఏమవుతుందిలే అనే చిన్న నిర్లక్ష్యపు ఆలోచనతో మొదలై, చివరకు సమాజం మొత్తం అక్రమాలను, అన్యాయాలను సాధారణీకరించే ప్రమాదకర స్థాయికి చేరుకుంటుంది. భగవద్గీతలో శ్రీకృష్ణుడు అర్జునుడికి ఉపదేశించిన దివ్య వాక్యాలు ఇక్కడ మనందరికీ సరియైన దారిని చూపిస్తాయి. సమాజంలో ధర్మం క్షీణించినప్పుడు, అధర్మం విపరీతంగా పెరిగినప్పుడు, చేతులు ముడుచుకుని మౌనంగా ఉండటం ఎంతమాత్రం సరికాదు. సమాజ హితం కోసం నిలబడి, గొంతెత్తి, అవసరమైతే ధర్మబద్ధంగా పోరాడాలి. కృష్ణుడు స్వయంగా శాంతిదూతగా పాండవుల రాయబారం కోసం కురుసభకు వెళ్ళి, ఆ రాయబారం విఫలమైనప్పుడు, తటస్థంగా ఉండిపోలేదు. ఆయన స్పష్టంగా ధర్మం పక్షమే వహించాడు. ఇదే మహాభారత గ్రంథం మనకు అందిస్తున్న అసలైన జీవన పాఠం. జీవితంలో తటస్థత అనేది కేవలం ఒక మానసిక భ్రమ మాత్రమే. వాస్తవంలో న్యాయం అన్యాయం మధ్య వహించే మౌనం ఎప్పుడూ అధర్మం వైపే మొగ్గు చూపుతుంది. మహాభారతం మనకు వేల సంవత్సరాల క్రితమే అందించిన ఈ హెచ్చరిక, నేటి ఆధునిక వార్తా సమాజంలో మరింత సందర్భోచితంగా మారింది. మన కళ్ళెదుట జరుగుతున్న అన్యాయాన్ని చూసి మౌనంగా ఉండటం అనేది సౌమ్యత ఎంతమాత్రం కాదు, అది పిరికితనం, తటస్థత అంతకన్నా కాదు, అది ఒక నిశ్శబ్ద సామాజిక నేరం. భీష్ముడి పశ్చాత్తాపం, ద్రౌపది ఆక్రందన, కృష్ణుడి హెచ్చరిక, ఇవన్నీ మనకు ఒకే ఒక్క సందేశాన్ని ఇస్తున్నాయి. అన్యాయంపై గొంతెత్తడానికి ధైర్యం చేయని రోజున, మనం కూడా ఆ కురుసభలోని మౌన సాక్షులుగానే చరిత్రలో మిగిలిపోతాం. కాబట్టి, తదుపరిసారి మీ కళ్ళెదుట అక్రమం జరిగినప్పుడు, నాకెందుకు అనే స్వార్థపు ఆలోచన మదిలో మెదిలితే, భీష్ముడి చివరి మాటలను తప్పక గుర్తుంచుకోండి. మౌనం ఎప్పటికీ నిర్దోషి కానే కాదు!




డా .సూర్యదేవర రామకృష్ణ ,
9490754169


# అరుణాచల్‌పై చైనా కుట్రలకు చెక్

## అరుణాచల్ మ్యాప్‌ను విడుదల చేసిన భారత్




**భా**రత్‌లోని అరుణాచల్ ప్రదేశ్‌లో పలు ప్రాంతాలను తమవిగా చెప్పుకునే చైనాకు భారత్ గట్టి కౌంటర్ ఇచ్చింది. ఆ రాష్ట్రంలోని నాలుగు మౌంటెయిన్ పాస్‌లు, ఒక సరస్సు సహా 27 కీలక ప్రాంతాలతో కూడిన సవివరమైన ప్రామాణిక మ్యాప్‌ను సర్వే ఆఫ్ ఇండియా విడుదల చేసింది. ఇరు దేశాల మధ్య సరిహద్దుకు సంబంధించి పూర్తి క్లారిటీతో ఈ మ్యాప్‌ను విడుదల చేసింది. అరుణాచల్ ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వంతో సంప్రదింపుల తరువాత ఈ మ్యాప్‌ను ఖరారు చేసినట్టు హోంశాఖ తెలిపింది. తాజా మ్యాప్‌తో ప్రజలకు మరింత అవగాహన పెరుగుతుందని సర్వే ఆఫ్ ఇండియా చెప్పింది. మ్యాప్‌లో తాజాగా చేర్చిన 27 ప్రాంతాల్లో సరిహద్దున ఉన్న మూడు ప్రాంతాలకు (సుబన్‌సిరి జిల్లా) వ్యూహాత్మక ప్రాధాన్యం ఉంది. అదే జిల్లాలోని నాలుగు మౌంటెయిన్ పాస్‌లను కూడా మ్యాప్‌లో చూపించారు. ఈ ప్రాంతాలన్నీ మిలిటరీ మ్యాపుల్లో ఇప్పటికే అందుబాటులో ఉన్నప్పటికీ సర్వే ఆఫ్ ఇండియా మ్యాపులో వీటిని స్పష్టంగా చూపించడమంటే చైనాకు గట్టి కౌంటర్ ఇచ్చినట్టేనని సంబంధిత వర్గాలు తెలిపాయి. మ్యాపులో చూపించిన పలు ప్రాంతాల్లో చైనా, భారత్ దళాల మధ్య ఘర్షణలు జరిగాయి. అరుణాచల్ ప్రదేశ్‌ను దక్షిణ టిబెట్ అని పిలిచే చైనా ఆ రాష్ట్రంలోని 23 ప్రాంతాలకు కొత్త పేర్లను ఖరారు చేస్తూ ఒక ప్రకటన విడుదల చేసిన విషయం తెలిసిందే. అయితే, ఈ చర్యలతో క్షేత్రస్థాయిలో ఎలాంటి మార్పులు ఉండవని చైనాకు భారత్ అప్పట్లోనే గట్టి కౌంటర్ ఇచ్చింది. అరుణాచల్ ప్రదేశ్ ఎప్పటికీ భారత్‌లో భాగంగానే ఉంటుందని స్పష్టం చేసింది. చైనా, భారత్‌ల మధ్య సరిహద్దు రేఖ మెక్‌మెహన్ లైన్ టిబెట్, అరుణాచల్ ప్రదేశ్‌ను వేరు చేస్తున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో అరుణాచల్ ప్రదేశ్‌లో 27 ప్రదేశాలకు భారత్ కొత్త పేర్లను పెట్టింది. కొన్ని ప్రదేశాలకు చైనా పేర్లు పెడుతున్న నేపథ్యంలో.. దానికి కౌంటర్‌గా ఇండియా కూడా కొత్త పేర్లను ఖరారు చేసింది. భారతీయ మ్యాప్‌లో సుమారు 27 ప్రదేశాలను గుర్తించి .. వాటికి ఇండియా కొత్త పేర్లను పెట్టింది. అరుణాచల్ ప్రదేశ్‌కు చెందిన సర్వే ఆఫ్ ఇండియా మ్యాప్‌లో ఆ ప్రదేశాలను గుర్తించారు. స్థానికులు గుర్తుపట్టే రీతిలో ఆ పేర్లను పెట్టినట్లు ప్రకటనలో తెలిపారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని ప్రదేశాలకు చైనా పేర్లు పెట్టడాన్ని భారత్ వ్యతిరేకించిన విషయం తెలిసిందే. వాస్తవాధీన రేఖ వెంట ఉన్న లాంగ్ జూ ప్రాంతం కూడా కొత్తగా పేరు పెట్టిన ప్రదేశంలో ఉన్నది. ఇక్కడే 1959లో ఇండియా, చైనా మధ్య ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ ప్రాంతంలోకి చైనా దళాలు ఎంటర్ అయ్యాయి. లాంగ్ జూ సమీపంలో ఉన్న మాజా అనే గ్రామాన్ని కూడా కొత్త మ్యాప్‌లో మార్క్ చేశారు. ఇది అప్పర్ సుబన్‌సిరి జిల్లాలో ఉన్నది. పర్వత ప్రాంతాలైన జో లా, రిజా లా, పుకుర్ లాతో పాటు బిసా గ్రామం కూడా కొత్త లిస్టులో ఉన్నది. హై ఆల్టిట్యూడ్ పాసేజ్‌లో థాగ్ లా ఉన్నది. 1962లో ఇదే ప్రాంతంలో భారత్, చైనా మధ్య ఘర్షణ జరిగింది. ప్రస్తుతం ఈ ప్రాంతాన్ని కూడా అధికారికంగా మ్యాప్‌లో గుర్తించారు. చాంగ్‌లాంగ్ జిల్లాలో ఉన్న జైరాంపూర్‌ను కూడా లిస్టులో పెట్టారు. సాంబో సరోవర్, బారా కుందన్, చోటా కుందన్, దాన్ బారి, ప్రిత్‌నగర్, తెరిత్నగర్, రామ్‌నగర్, జశ్వంత్ ఘర్, సాగర్, పద్మ, జ్యోతినగర్, బైసాకి ప్రాంతాలు కొత్త లిస్టులో ఉన్నాయి. షేర్ ఏ తప్పా స్మారకం, చోటా రూపక్, బారా రూపక్, శివాజీ నగర్, సున్పురా, కమలాంగ్ నగర్, కమలాంగ్ సాంక్చురీ, బుద్ధామందిర్ కూడా జాబితాలో ఉన్నాయి. అరుణాచల్ ప్రదేశాన్ని .. జాంగ్‌నాన్ అని చైనా పిలుస్తున్నది.

# అంతర్జాతీయ సదస్సులో పాలకీడు వాసి

- మూసిఒడ్డు సింగారం గ్రామ వాసికి అంతర్జాతీయ గుర్తింపు
- మారు మూల గ్రామం నుండి అంతర్జాతీయ స్థాయిలో సెమినార్
- నాడు జర్మనీ... నేడు శ్రీలంక దేశాలలో సెమినార్లు
- హైదరాబాద్ విశ్వవిద్యాలయ పరిశోధకులకు అంతర్జాతీయ గుర్తింపు
- మూసి ఒడ్డు సింగారం వాసికి దక్కిన ఘనత
- శ్రీలంక లో "సస్టైనబుల్ ఎడ్యుకేషన్ 2026" పై పరిశోధనా పత్రం సమర్పణ
- సెంట్రల్ యూనివర్సిటీ ప్రొఫెసర్ రావుల కృష్ణ కు పలువురి ప్రశంశలు





**క్రైమ్ మిర్రర్ ,పాలకీడు :** హైదరాబాద్ విశ్వవిద్యాలయం లోని సామాజిక శాస్త్రాల పాఠశాల, విద్య మరియు విద్యా సాంకేతిక విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డా. రావుల కృష్ణయ్య తన పరిశోధక విద్యార్థి సాక్షి కలిసి విశ్వవిద్యాలయం తరఫున 3వ అంతర్జాతీయ సస్టైనబుల్ ఎడ్యుకేషన్ సదస్సు (ఐసిఎస్ఈ 2026)లో పాల్గొని తమ పరిశోధనా పత్రాన్ని సమర్పించారు.వారు "సమగ్ర, సాంస్కృతిక స్పందనాత్మక విద్యపై భవిష్యత్ ఉపాధ్యాయ విద్యావేత్తల అవగాహన: సుస్థిర అభివృద్ధికి నూతన దృక్పథం" అనే శీర్షికతో తమ పరిశోధనా పత్రాన్ని 5 ఆగస్టు 2026న శ్రీలంకలోని ఇన్ఫర్మాటిక్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఐఐటి)లో సమర్పించారు. ఈ అంతర్జాతీయ సదస్సును మలేషియాలోని ఐఎన్టిఐ ఇంటర్నేషనల్ యూనివర్సిటీ నిర్వహించగా, శ్రీలంకలోని ఇన్ఫర్మాటిక్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ఆతిథ్యం ఇచ్చింది. ప్రపంచవ్యాప్తంగా ఉన్న పరిశోధకులు, విద్యావేత్తలు, అధ్యాపకులు ఈ సదస్సులో పాల్గొని సుస్థిర విద్యకు సంబంధించిన అభివృద్ధి చెందుతున్న అంశాలపై అర్థవంతమైన చర్చలు జరిపారు.వారు సమర్పించిన పరిశోధనలో సమగ్ర మరియు సాంస్కృతికంగా స్పందించే విద్యా విధానాల ప్రాముఖ్యతను ప్రధానంగా ప్రస్తావించారు. విభిన్నమైన అభ్యాస అవసరాలను తీర్చగల సామర్థ్యంతో పాటు, సుస్థిర అభివృద్ధికి దోహదపడే విధంగా భవిష్యత్ ఉపాధ్యాయులను సిద్ధం చేయడంలో ఇటువంటి విద్యా విధానాలు కీలక పాత్ర పోషిస్తాయని అధ్యయనం వెల్లడించింది.భవిష్యత్ ఉపాధ్యాయులు కలిగి ఉన్న అభిప్రాయాలను పరిశీలించడం ద్వారా, సమానత్వం, విద్యార్థి-కేంద్రీకృత అభ్యాసం, సాంస్కృతిక వైవిధ్యాన్ని గౌరవించే బోధనా విధానాలు నాణ్యమైన విద్యను అందించడంతో పాటు బోధన-- అభ్యసన ప్రక్రియల్లో సుస్థిరతను సాధించేందుకు ఎంతో అవసరమని ఈ పరిశోధన స్పష్టం చేసింది.

ఈ అంతర్జాతీయ పరిశోధనా పత్ర సమర్పణ ద్వారా హైదరాబాద్ విశ్వవిద్యాలయం పరిశోధనలో అత్యుత్తమతను ప్రోత్సహించడం, అంతర్జాతీయ స్థాయిలో విద్యా సహకారాలను బలోపేతం చేయడం, అలాగే సుస్థిర అభివృద్ధి లక్ష్యాలకు అనుగుణంగా విద్యా రంగంలో నూతన ఆవిష్కరణలకు తోడ్పడటంలో తన నిబద్ధతను మరోసారి చాటుకుంది.ఈ విశిష్టమైన విజయాన్ని సాధించిన డా. రావుల కృష్ణయ్య, పరిశోధక విద్యార్థి సాక్షి లకు హైదరాబాద్ విశ్వవిద్యాలయం హృదయపూర్వక అభినందనలు తెలియజేసింది .వారి భవిష్యత్ విద్యా మరియు పరిశోధనా ప్రయాణం మరింత విజయవంతంగా కొనసాగాలని ఆకాక్షించారు.

**అంచెలంచెలుగా ఎదిగి అంతర్జాతీయ స్థాయికి**

సూర్యాపేట జిల్లా పాలకీడు మండలంలోని మూసిఒడ్డు సింగారం గ్రామంలో పుట్టి ఎన్నో కష్టాలను, పేదరికాన్ని అధిగమిస్తూ పశువుల కాపరి, సెక్యూరిటీ గార్డ్, విద్యా వాలంటీర్ ప్రారంభించి, డిగ్రీ, పీజీ, పీహెచ్.డి పూర్తి చేసి, నేడు హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్ ప్రొఫెసర్ గా ఎదిగిన డాక్టర్ కృష్ణయ్య సాధించిన ఈ విజయం అనేక మందికి ప్రేరణగా నిలుస్తోంది. గత సంవత్సరం నవంబర్ లో జర్మనీలో సుస్థిర విద్యపై ప్రదర్శన ఇచ్చారు. ప్రస్తుతం శ్రీలంకలోనీ కొలంబో వేదికగా "సస్టైనబుల్ ఎడ్యుకేషన్ 2026" పై పరిశోధనా పత్రం సమర్పించారు.

## సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాల పోస్టర్ ఆవిష్కరణ

**క్రైమ్ మిర్రర్ , పాలకీడు :** సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి ఉత్సవాల పోస్టర్ ను శనివారం గౌడ ఉద్యమం జిల్లా అధికార ప్రతినిధి బొల్లగాని సుబ్బు గౌడ్ ఆధ్వర్యంలో జై గౌడ్ ఉద్యమ నాయకులు ఆవిష్కరించారు.ఈ సందర్భంగా సుబ్బు గౌడ్ మాట్లాడుతూ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ మూడొందల డెబ్బై ఆరవ జయంతి జాతీయ ఉత్సవాలను జై గౌడ్ ఉద్యమం ఆధ్వర్యంలో ఆగస్టు పదిన సోమవారం ఉదయం పదకొండు గంటలకు రవీంద్రభారతి ప్రధాన ఆడిటోరియంలో జరుగుతున్నదనీ,దేశవ్యాప్తంగా ఉన్న గౌడ ప్రముఖులు ప్రజాప్రతినిధులు,ఉద్యోగ సంఘాల నేతలు,వివిధ గౌడ సంఘాల నేతల పాల్గొననున్నారన్నారు. ఈ సందర్భంగా మండలంలోని జై గౌడ్ ఉద్యమ నాయకులందరూ పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో జై గౌడ ఉద్యమ సంఘ నాయకులు బొల్లగాని లింగయ్య గౌడ్, ఉయ్యాల దుర్గయ్య గౌడ్, చిన్న అచ్చయ్య గౌడ్, దుర్గయ్య గౌడ్,వీరబాబు గౌడ్,నాగయ్య గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



క్రైమ్ మిర్రర్ తెలుగు వెబ్‌సైట్‌కు
కంటెంట్ రైటర్లు కావలెను
సీనియర్లకు మాత్రమే ప్రాధాన్యం



తెలుగులో న్యూస్, ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్, సోషల్ అప్‌డేట్స్ మరియు ఫీచర్ రైటింగ్‌లో ఆసక్తి ఉన్న వారికి మంచి అవకాశం.
క్రైమ్ మిర్రర్ తెలుగు డిజిటల్ మీడియా టీమ్ విస్తరణలో భాగంగా అనుభవజ్ఞులైన కంటెంట్ రైటర్లు (సీనియర్ జర్నలిస్టులు, సబ్ ఎడిటర్లు) అవసరం.
తెలుగు భాషపై పట్టు, వార్తా రచనా నైపుణ్యం ఉండాలి. రాజకీయ, క్రైమ్, సోషల్ ఇష్యూస్, ఫీల్డ్ రిపోర్టింగ్‌పై అనుభవం ఉంటే ప్రాధాన్యం.
న్యూస్ వెబ్‌సైట్, ప్రింట్, డిజిటల్ జర్నలిజంలో కనీసం 1 సంవత్సరాల అనుభవం తప్పనిసరి.
స్వతంత్రంగా వార్తలు సిద్ధం చేయగలగాలి, ఫ్యాక్ట్ చెక్ అవగాహన ఉండాలి.
సీనియర్ కంటెంట్ రైటర్స్, సబ్ ఎడిటర్ (డెస్క్ న్యూస్ ఎడిటింగ్), ఫీల్డ్ రిపోర్టర్, ప్రాంతీయ కవరేజ్ కోసం.
సీనియర్ జర్నలిస్టులు, డెస్క్ అనుభవం ఉన్నవారికి మాత్రమే ప్రాధాన్యం ఇవ్వబడుతుంది.
ఫ్రీలాన్స్ లేదా పార్ట్‌టైమ్ ఆధారంగా కూడా అవకాశాలు అందుబాటులో ఉన్నాయి.
9393929595

## ప్రతిపక్షానికి ఒక న్యాయం..?



### అధికార పక్షానికి ఒక న్యాయమా..?

### కాటేదాన్ డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్

గండిపేట(క్రైమ్ మిర్రర్): రాజేంద్రనగర్ నియోజకవర్గం కాటేదాన్ డివిజన్‌లో బీఆర్ఎస్ పార్టీ ఫెక్సీలను తొలగించిన జీహెచ్ఎంసీ అధికారులపై డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు ఎస్.వెంకటేష్ ధ్వజమెత్తారు. ఫ్లెక్సీలు తొలగించినంత మాత్రన బీఆర్ఎస్ పార్టీకి కానీ, కేసీఆర్‌కి కానీ, రాజేంద్రనగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ఇన్‌చార్జ్ పట్లోళ్ల కార్తీక్‌రెడ్డికి ప్రజాదరణ తగ్గదన్నారు. పై నుంచి పెద్దల ఆదేశాలతో తొలగించామంటున్న జీహెచ్ఎంసీ అధికారులు, పోలీసుల తీరు సరైంది కాదన్నారు. ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అనధికార ఫ్లెక్సీలను తొలగించకుండా బీఆర్ఎస్ పార్టీ ఫ్లెక్సీలు తొలగించడం ఏంటని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో కూడా ఇదే విధంగా బీఆర్ఎస్ పార్టీ ఫ్లెక్సీలను తొలగించి జీహెచ్ఎంసీ అధికారులు, అదే విధంగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీ ఫ్లెక్సీలను ఎందుకు తొలగించట్లేదని ప్రశ్నించాఉ. కేవలం బీఆర్ఎస్ అంటే మీకు వణుకునా... అధికారం ఎప్పుడు శాశ్వతం కాదు ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేశారని అన్నారు. ఈ ఫ్లెక్సీల తొలగించు చర్య ప్రభుత్వ దిగజారుడు తనానికి నిదర్శనం అని ధ్వజమెత్తారు.



## కార్మికుల హక్కుల కోసం జైల్ భరో జయప్రదం చేయాలి

**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) :** కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక కర్షక, రైతు వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో ఆగస్టు 10వ తేదీన చేపడుతున్న జైల్ బరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సిపిఎం జిల్లా నాయకులు, బాలాపూర్ మండల ఇంచార్జి గోరెంకల నర్సింహా పిలుపునిచ్చారు. శనివారం బాలాపూర్ మండలం బాలాపూర్ చౌరస్తాలోని ప్రజా సంఘాల ఆఫీస్ లో కార్మికులతో కలసి కరపత్రాలను విడుదల చేయడం జరిగింది. ఈ సందర్భంగా గోరెంకల నర్సింహా మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు లేబర్ కోడ్ లను వెంటనే రద్దు చేయాలని వారు డిమాండ్ చేశారు. కార్మికుల, రైతులు, వ్యవసాయ కార్మికులు నిర్వహిస్తున్న జైల్ బరో కు సీపీఎం పార్టీ సంపూర్ణ మద్ధతు ప్రకటిస్తుందని అన్నారు. సుప్రీంకోర్టు సూచన మేరకు 26వేల రూపాయల కనీస వేతనం ఇవ్వాలని, ప్రభుత్వ రంగ సంస్థలను నిర్వీర్యం చేస్తూ ప్రభుత్వ ఉద్యోగాలను క్రమంగా తగ్గించే ప్రయత్నం జరుగుతుందని, ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటు వాళ్లకు దార దత్తం చేస్తూ చదువుకున్న విద్యార్థులకు ఉపాధి లేకుండా చేయడం సిగ్గుచేటని, కేంద్ర ప్రభుత్వం ప్రశ్నించే హక్కును కాలరాయడం సిగ్గుచేటని, కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను మానుకోవాలని లేకుంటే పెద్ద ఎత్తున కార్మికులను, రైతులను కూడగట్టుకొని తిరుగుబాటు చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా నాయకులు దాసరి బాబు, బి సి డబ్ల్యూ అధ్యక్షులు నీలం వెంకయ్య, కార్యదర్శి దాసరి నర్సింహా, కోశాధికారి దన్నశి మల్లికార్జున్, చేరుపల్లి కుమార్, దేవరపు ఏడుకొండలు, తదితరులు పాల్గొన్నారు.

## లార్డ్స్ ఒలింపియాడ్ పాఠశాలలో ఘనంగా బోనాల ఉత్సవాలు



**బాలాపూర్ (క్రైమ్ మిర్రర్) :** బడంగ్ పేటలోని లార్డ్స్ ఒలింపియాడ్ పాఠశాలలో బోనాల సంబరాలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులందరూ రంగురంగుల దుస్తులు ధరించి బోనం ఎత్తుకొని అమ్మవారికి ఊరేగింపుగా వెళ్లి బోనాన్ని సమర్పించారు. ఈ కార్యక్రమంలో లార్డ్స్ విద్యాసంస్థల చైర్మన్ సిద్దాల బీరప్ప మాట్లాడుతూ తెలంగాణ ప్రాంతంలో అత్యంత వైభవంగా జరుపుకునే పండగ ఈ బోనాల పండుగని, అందరి పైన అమ్మవారు తమ కరుణాకటాక్షాలు కురిపించాలన్నారు. పాఠశాల వైస్ చైర్మన్ బెర్ల శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ అత్యంత శక్తివంతమైన అమ్మవారిని బోనాల సందర్భంగా పూజించుకొని తరించడం చాలా అదృష్టం అన్నారు. విద్యార్థులు అందరూ బోనం ఎత్తుకొని పోతురాజుల సమక్షంలో బడంగ్పేట్ లోని అమ్మవారికి బోనాలను సమర్పించి తమ కోరికలను విన్నవించుకున్నారు. ఈ కార్యక్రమంలో లార్డ్స్ డైరెక్టర్ సిద్ధాల శ్రీలత, డీన్ సతీష్, లార్డ్స్ ఒలింపియాడ్ ప్రిన్సిపాల్ బానూరు శ్రీనివాస్ రెడ్డి, ఉపాధ్యాయులు విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

## రేవనపల్లి చిన్న వీరాస్వామి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేసిన సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి



**సంస్థాన్ నారాయణపురం, ఆగష్టు 08(క్రైమ్ మిర్రర్):** యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండల కేంద్రానికి చెందిన చిన్న వీరస్వామి శుక్రవారం రాత్రి అనారోగ్యం మరణించారు విషయం తెలుసుకున్న సర్పంచ్ ఉప్పల విజయలక్ష్మి లింగస్వామి నిరుపేద కుటుంబం అయినటువంటి చిన్న వీరస్వామి కుటుంబానికి 5,000 రూపాయలు అందేశారు ఈ యొక్క ఆర్థిక సహాయం 2వ వార్డు సభ్యులు పందుల యాదగిరి గౌడ్ చేతుల మీదుగా మృతుడి కుటుంబ సభ్యులకు అందజేశారు అనంతరం మృతదేహానికి పూలమాలవేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో క్రైమ్ మిర్రర్ రిపోర్టర్ ఉప్పల వెంకటేష్, కాంగ్రెస్ పార్టీ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి ఉప్పల నాగరాజు, కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి రేవన పెల్లి గోపాల్, పల్లె ఆనంద్ గౌడ్, పెద్దగోని గిరి గౌడ్, పొట్ట వెంకటేష్, జనగాం అంజయ్య ,సతీష్ తదితరులు పాల్గొన్నారు

# ఎలినో పేరు చెప్పి, రైతులకు పంటలు పండకుండా చేస్తున్నారు

## వనపర్తి జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షులు గట్టు యాదవ్



**వనపర్తి ఆగస్టు 8 క్రైమ్ మిర్రర్ :** నీళ్లు వదిలితే పంటలు పండుతాయి. బోనస్ ఇవ్వాల్సి వస్తది అని కాంగ్రెస్ కుట్రలు పొందుతుందని ప్రజాప్రతినిధులు కనీసం ఇరిగేషన్ పైన అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు వనం రాములు. టౌన్ అధ్యక్షులు.దిలీప్ రెడ్డి. అన్నారు. శనివారం పెబ్బేరు. మున్సిపల్ కేంద్రంలో ప్రెస్ క్లబ్ లో నిర్వహించిన సమావేశంలో బిఆర్ఎస్ వనపర్తి జిల్లా అధ్యక్షులు గట్టు యాదవ్. మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ మాట్లాడుతూ వ్యవసాయాన్ని పండగ చేసి చూపిస్తాం అని తప్పుడు వాగ్దానాలు చేసి అధికారంలో వచ్చిన వీళ్ళకు కనీసం వ్యవసాయం పైన మినిమం అవగాహన కూడా లేదు. అన్నారు. ఎలినో పోయి వర్షాలు పడి నీళ్లు వస్తే ఎట్లా ఉపయోగించుకోవాలి అనే సోయి కూడా లేదు ఈ కాంగ్రెస్ ప్రభుత్వానికి.మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అనుక్షణం ప్రభుత్వాన్ని హెచ్చరిస్తూనే ఉన్నాడు.వర్షాలు వస్తున్నాయి. డ్యాముల నీళ్లు విడుదల చేయాలి రైతులను ఆదుకోవాలి చెరువులు నింపాలి గుంటలు నింపాలి అని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్న నిమ్మకు నిరెతిన్నట్లు ఉన్నారు.నీళ్ల మీద, రైతుల మీద, వ్యవసాయం మీద బాధ్యత, మమకారం, సోయి లేని సన్నాసులు ఈ కాంగ్రెసోళ్ళు.నిన్న బీఆర్ఎస్ పార్టీ తెలంగాణ భవన్ లో మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఈ నెల 11న నార్లాపూర్ ముట్టడిస్తామని హెచ్చరికలు చేసిన తరువాతే కాలువలకు నీళ్లు వదిలారు.ఇప్పటికి కూడా గుడిపల్లి రిజర్వాయర్ లో నీళ్లు ఎత్తిపోస్తున్నారు. కానీ కాలువలకు నీళ్లు ఈ క్షణం వరకు వదల్లేదు. బీఆర్ఎస్ హెచ్చరికల తరువాతనే ఎల్లూరు, జొన్నలబొగుడ, గుడిపల్లిలలో మోటార్లు ఆన్ చేశారు.తాగునీటి కోసమే ఎల్లూరు, గుడిపల్లి, జొన్నలబొగుడ రిజర్వాయర్లు నింపేందుకు ప్రయత్నించారు. కానీ రైతులకు సాగునీరు ఇవ్వడానికి కాదు. ఇప్పటికి కూడా ఎక్కడా రైతులకు సాగునీరు విడుదల చేయడం లేదు.ప్రభుత్వానికి చిత్తశుద్ధి కేఎల్ఐ పరిధిలోని 500 చెరువులు, కుంటలు వెంటనే నింపాలి. రైతులకు సాగునీరు అందించాలి బీఆర్ఎస్ హెచ్చరికల నేపథ్యంలోనే ప్రభుత్వం పూర్తి స్థాయిలో మోటార్లు ఆన్ చేసింది. నిన్న సాయంత్రం వరకు ఎల్లూరు, జొన్నలబొగుడలలో నడిచింది ఒక్కటే మోటరు. ప్రస్తుతం కూడా జొన్నల బొగుడలో ఒక్కటే మోటారు నడుస్తుంది.గుడిపల్లిలో ఈ క్షణం వరకు నీళ్లు విడుదల చేయలేదు. బీఆర్ఎస్ హెచ్చరికలతో కాంగ్రెస్ నేతలు అబద్దాలు ప్రచారం చేస్తున్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ కర్రెస్వామి, కౌన్సిలర్లు శంకర్ నాయుడు. మన్యం. నాయకులు. సాయినాథ్. రాజశేఖర్. సహాదేవ్ .వడ్డె రమేష్. సాయిరెడ్డి .వడ్డె శీను. మహేష్. రమేష్ .తదితరులు పాల్గొన్నారు



# పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలి

## మార్కెట్ చైర్మన్ ప్రమోదిని రెడ్డి

**వనపర్తి ఆగస్టు 8 క్రైమ్ మిర్రర్:** పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా మొక్కలు నాటి సంరక్షించాలని మార్కెట్ చైర్మన్ ప్రమోదిని రెడ్డి అన్నారు. వన మహోత్సవం కార్యక్రమంలో మార్కెట్ యాడ్ ఆవరణలో మార్కెట్ చైర్మన్ ప్రమోదిని రెడ్డి , వైస్ చైర్మన్ విజయ వర్ధన్ రెడ్డి,మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్. కలిసి మొక్కలు నాటారు.?ఈ సందర్భంగా చైర్మన్ ప్రమోదిని రెడ్డి మాట్లాడుతూ పెరుగుతున్న కాలుష్యాన్ని నివారించాలంటే పచ్చదనాన్ని పెంపొందించడం ఒక్కటే మార్గమన్నారు. నాటిన ప్రతి ఒక్క మొక్కను బాధ్యతగా సంరక్షించాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరెక్టర్లు. రామన్ గౌడ్ మదిరాముడు నరసింహనాయుడు శంకర్ ఆంజనేయులు మార్కెట్ కార్యదర్శి. అనిల్ కుమార్ యుగంధర్ రెడ్డి రణధీర్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

# ఆగస్టు 10న చలో జైల్‌భరో కార్యక్రమాన్ని జయప్రదంచేయాలి

## సీఐటీయూ త్రీటౌన్ హమాలీ కమిటీ ఆధ్వర్యంలో సన్నాహక జనరల్‌బాడీ సమావేశం



**ఖమ్మం క్రైమ్ మిర్రర్ బ్యూరో :** ఆగస్టు 10న నిర్వహించనున్న చలో జైల్‌భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ త్రీటౌన్ హమాలీ కమిటీ నాయకులు కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక త్రీటౌన్ ఏరియాలో సీఐటీయూ త్రీటౌన్ కమిటీ, హమాలీ యూనియన్ ఆధ్వర్యంలో సన్నాహక జనరల్‌బాడీ సమావేశాన్ని నిర్వహించారు.ఈ జనరల్‌బాడీ సమావేశానికి భూక్య శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. సమావేశంలో ముఖ్య అతిథులుగా రైతు సంఘశీ రాష్ట్ర నాయకులు మాదినేని రమేష్, బొంతు రాంబాబు, వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి ఎర్ర శ్రీనివాసరావు, అధ్యక్షులు మెరుగు సత్యనారాయణ, సీ.ఐ.టీ.యూ జిల్లా అధ్యక్షులు తుమ్మ విష్ణు, జిల్లా కార్యదర్శి కళ్యాణం వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా కార్మికులు, కర్షకులు, పేద ప్రజలు ఐక్యంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆగస్టు 10న చలో జైల్‌భరో కార్యక్రమంలో కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.కార్మికుల ఐక్యతతోనే హక్కులను సాధించుకోవచ్చని, సమస్యలపై నిరంతరం పోరాటాలు నిర్వహించాల్సిన అవసరం ఉందని వారు అన్నారు. త్రీటౌన్ ప్రాంతంలోని హమాలీ కార్మికులు, ఇతర కార్మికులు పెద్ద సంఖ్యలో చలో జైల్‌భరో కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బండారు యాకయ్య, మల్లికార్జున్, పిరయ్య, మల్లిఖార్జున, రామకృష్ణ హమాలీ యూనియన్ నాయకులు, కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## పుట్టినరోజు వేడుకల్లో పాల్గొన్న పరిగి మాజీ ఎమ్మెల్యే మహేష్ రెడ్డి

క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల: గండ్వీడ్ మండలంలోని వెన్నచెడు గ్రామంలో టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు వార్డ్ మెంబర్ దొడ్డే అనంతమ్మ అశోక్ మనమరాలి పుట్టినరోజు వేడుకలలో పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి నాయకులతో కలిసి పాల్గొని చిన్నారిని ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ చెన్నయ్య, మాజీ జెడ్పిటిసి శ్రీనివాస్ రెడ్డి, బిఆర్ఎస్ పార్టీ నాయకులు వెంకట్ రాములు, చెన్నప్ప, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



# హర్ ఘర్ తిరంగా ప్రతి ఇంటికి తీసుకు వెళ్ళాలి



**క్రైమ్ మిర్రర్, నేరేడుచర్ల :** దేశభక్తి భావాన్ని ప్రతి ఇంటికి చేర్చే మహత్తర కార్యక్రమమే హర్ ఘర్ తిరంగా కార్యక్రమమని జిల్లా కో కన్వీనర్ నందిపాటి హిందూజా పార్టీ శ్రేణులకి పిలుపునిచ్చారు. శనివారం నేరేడుచర్లలో సన్నాహక సమావేశం నిర్వహించిన సందర్భంగా హిందూజా మాట్లాడుతు మన దేశ సమైక్యత, జాతీయ సమగ్రతను బలోపేతం చేయడం ప్రతి భారతీయుడి భాధ్యత అని,విద్యార్థులు,మేధావులు ,ప్రజాసంఘాలు దేశ భక్తి భావాలను పెంపొందించే కార్యక్రమాలలో భాగస్వాములు కావాలని, ప్రతి ఇంటిపై జాతీయ జెండా ఎగరేల ప్రజలలో చైతన్యం తీసుకురావడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని,మన పట్టణం లో నిర్వహించే తిరంగా యాత్రలో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు చింతకుంట్ల రాజేష్ రెడ్డి , నరి నాయక్ , కుక్కడపు వెంకటేశ్వర్లు,వేమిరెడ్డి శంకర్ రెడ్డి,జిల్లా నాయకులు సంకలమద్ది సత్యనారాయణ రెడ్డి, ఊర్మిళ రామ్మూర్తి, ప్రధాన కార్యదర్శి కాలం నాగయ్య, విజయ్ రెడ్డి, సీనియర్ నాయకులకు కొప్పు లక్ష్మీనారాయణ, గుడ్డేటి పవన్, సోమనబోయిన మురళీకృష్ణ , చెంచల కిరణ్, నరేందర్ నాయక్, శక్తికేంద్రం ఇన్చార్జిలు, బూత్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

# ఆర్‌జీఐఏ పోలీసుల ఛేదన..

## 9 వాహన చోరీ కేసులు.. మైనర్ బాలుడి అదుపులోకి..

## రూ.5 లక్షల విలువైన వాహనాలు స్వాధీనం



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (ఆర్‌జీఐఏ) పోలీసులు వాహన చోరీ కేసులను ఛేదించారు. వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన 9 ఆటోమొబైల్ చోరీ కేసుల్లో ప్రమేయం ఉన్నట్లు అనుమానిస్తున్న ఓ మైనర్ బాలుడిని అదుపులోకి తీసుకున్నారు. అతడి వద్ద నుంచి సుమారు రూ.5 లక్షల విలువైన చోరీ వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. నారాయణపేట జిల్లా మక్తల్‌లోని టీచర్స్ కాలనీకి చెందిన జె. అఖిరానందన్ (15)ను అదుపులోకి తీసుకున్నారు. దర్యాప్తులో భాగంగా ఆర్‌జీఐఏ, గచ్చిబౌలి, తపాచబుత్ర, పంజాగుట్టలో రెండు కేసులు, జూబ్లీహిల్స్, టోలిచౌకి, ఎస్ఆర్‌నగర్, ఐఎస్‌సదన్ పోలీస్‌స్టేషన్ల పరిధిలో నమోదైన వాహన చోరీ కేసులతో అతడికి సంబంధం ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. స్వాధీనం చేసుకున్న వాహనాల విలువ సుమారు రూ.5 లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. మైనర్ కావడంతో జువెనైల్ జస్టిస్ యాక్ట్ నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపడుతున్నట్లు ఆర్‌జీఐఏ పోలీసులు వెల్లడించారు.



# ఘనంగా పండుగ సాయన్న జన్మదిన వేడుకలు

**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** వికారాబాద్ జిల్లా కుల్కచర్ల మండలం ఇప్పాయిపల్లి గ్రామంలో ముదిరాజ్ సంఘం అధ్యక్షులు గాదె రాములు ఆధ్వర్యంలో శనివారం పండుగ సాయన్న జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పండుగ సాయన్న జీవించిన రోజులలో నిరంకుశ నిజాం అధికారుల పాలనలో పేద ప్రజలను ఎంతో హింసించే వారని పేదల పక్షాన నిలిచిన పండుగ సాయన్న సరికొత్త బహుజన రాజ్యాన్ని స్థాపించాడని భూస్వాములను ఎదిరించి పేదలకు అండగా నిలిచాడని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం ఉపాధ్యక్షులు వెన్నచేటి చిన్న చంద్రయ్య, ఇప్పాయిపల్లి గ్రామ సర్పంచ్ ఎర్రం పోటి మల్లేష్, ఉప సర్పంచ్ పడ్డ చిన్న వెంకటయ్య, ఫీల్డ్ అసిస్టెంట్ కురుంపల్లి నర్సింలు, రాంపూర్ గ్రామ సర్పంచ్ ఎక్కడ తిరుపతయ్య, మాజీ సర్పంచ్ బాల్ రెడ్డి, మాజీ ఎంపీటీసీ గుండుమల్ల ఆనంద్, ముదిరాజ్ సంఘం నాయకులు ముదిరాజ్ సంఘం నాయకులు ధ్యానముని రాములు, ధ్యానమని చంద్రయ్య జంగమల్లయ్య వెనచేటి అంజయ్య పినమోని ఎల్లయ్య నీలా రాఘవేందర్ మందుల శంకర్ రేణి వెంకటయ్య వెన్నచటి ప్రభాకర్ కామారం పెద్ద రాములు కౌజులు పెంటయ్య గొల్ల రామచంద్రయ్య పిన్నెముని నర్సింలు, కామారం చిన్న రాములు భవాని నరసింహులు పుణ్యమోని మల్లేష్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యంతో మృతి చెందిన గొడుగోనిపల్లి గ్రామ సర్పంచ్ కుటుంబాన్ని పరామర్శించిన పరిగి మాజీ ఎమ్మెల్యే

**క్రైమ్ మిర్రర్ కుల్కచర్ల:** వికారాబాద్ జిల్లా దోమ మండలం గొడుగోనిపల్లి గ్రామ సర్పంచ్ దశరథ్ రెడ్డి అనారోగ్యంతో ఇటీవలే మరణించారు. ఆ విషయాన్ని తెలుసుకున్న పరిగి మాజీ ఎమ్మెల్యే కొప్పుల మహేష్ రెడ్డి సోమవారం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి మనోధైర్యా కల్పించారు. దశరథ్ రెడ్డి మరణించడం గ్రామానికి కుటుంబానికి తీరనిలోటని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ పరిగి మండల అధ్యక్షులు ఆంజనేయులు, దోమ మాజీ సర్పంచ్,బిఆర్ఎస్ పార్టీ నాయకులు గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.



క్రైమ్ మిర్రర్®
Voice of Anti Corruption
తెలంగాణ జిల్లాలు
ఆదివారం 9-8-2026


# కొందుర్గ్ పీఏసీఎస్ నూతన చైర్మన్‌గా జితేందర్ రెడ్డి,,,!






## వైస్ చైర్మన్‌గా గోబ్రా నాయక్,,,!

**క్రైమ్ మిర్రర్ కొందుర్గు :-** కొందుర్గు మండలంలోని పీఏసీఎస్ కార్యాలయంలో నూతన చైర్మన్, వైస్ చైర్మన్, డైరెక్టర్లు పదవీ బాధ్యతలు స్వీకరించారు అనంతరం పలువురు నాయకులు మాట్లాడుతూ కష్ట పడ్డ వ్యక్తికి చైర్మన్ పదవి దక్కడం హర్షించదగ్గ విషయం అన్నారు . ఉమ్మడి మండలంపై ఎమ్మెల్యే శంకర్‌కు ప్రత్యేక అభిమానం ఉందని, రైతుల సంక్షేమానికి పాలకవర్గం కృషి చేయాలని ఆకాంక్షించారు. అనంతరం నూతన చైర్మన్ జితేందర్ రెడ్డి మాట్లాడుతూ.ఉమ్మడి మండలానికి సహకార బ్యాంకును తీసుకురావడానికి తన వంతు ప్రయత్నం చేస్తానని, రైతుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. తనకు ఈ పదవి దక్కడానికి సహకరించిన ఎమ్మెల్యే శంకర్, సిడబ్ల్యుసి ప్రత్యేక ఆహ్వానితులు చల్లా వంశీచందర్ రెడ్డి మాజీ ఎమ్మెల్యే ప్రతాప్ రెడ్డి, మాజీ జడ్పీటీసీ శ్యామ్ సుందర్ రెడ్డి ఉమ్మడి మండల ప్రజాప్రతినిధులు, రైతులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కష్టపడి పనిచేసే వారికి పదవులు లభిస్తాయని, తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుని రైతులకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని జితేందర్ రెడ్డి పేర్కొన్నారు.

**ఉమ్మడి మండలంలోని నూతన పీఏసీఎస్ పాలకవర్గం ఇదే..**

కొందుర్గు ఉమ్మడి మండలం పీఏసీఎస్ చైర్మన్ గా టి.జితేందర్ రెడ్డి, వైస్ చైర్మన్‌గా గోబ్రా నాయక్, డైరెక్టర్లు గా భీమారం మానయ్య, నంద కుమారి, కూర వీరన్న, గొల్ల మల్లేష్, మాదరి నర్సింలు, వాడ్ల నారాయణ చారి, తీగలపల్లి రాములు, ఎం.డి. ఇజాజ్ అలీ, కావలి వెంకటేష్, పటోళ్ల జగన్మోహన్ రెడ్డి, కాశ రత్నమ్మ లు మొత్తం 13 మంది పదవీ బాధ్యతలు చేపట్టారు ఈ కార్యక్రమంలో షాద్ నగర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణారెడ్డి, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు పురుషోత్తం రెడ్డి, మాజీ మండల అధ్యక్షులు చలివేంద్రంపల్లి రాజు, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి గోవర్ధన్ గౌడ్, మాజీ సర్పంచ్ బాలరాజ్, గోపాల్, నర్సింలు, రవి తదితరులు పాల్గొన్నారు.

# బాధిత రైతులకు న్యాయం చేయాలి: శాసనసభ్యునితో కాంగ్రెస్ నాయకుల చర్చలు



**గండిపేట్, (క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్ నియోజకవర్గ పరిధిలోని హైదర్‌గూడ గ్రామానికి చెందిన రైతుల భూముల సేకరణ విషయమై స్థానిక శాసనసభ్యులు ప్రకాష్ గౌడ్‌తో కాంగ్రెస్ పార్టీ హైదర్‌గూడ డివిజన్ అధ్యక్షుడు సామ ఇంద్రపాల్ రెడ్డి నాయకత్వంలో బాధిత రైతులు సమావేశమయ్యారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న మహాత్మా గాంధీ సరోవర్ ప్రాజెక్టు కోసం హైదర్‌గూడ పరిధిలోని 30 ఎకరాల వ్యవసాయ భూములకు భూసేకరణ ప్రకటన విడుదల చేయడంపై రైతులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. గత మూడు తరాలుగా, 50 సంవత్సరాలకు పైగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న భూములను కోల్పోతున్నామని గుమ్మకోండ పెంటారెడ్డి, గుమ్మకోండ హన్మంత్ రెడ్డి, ముంద్రా కొమురయ్య, ముంద్రా నర్సింహ, కోలన్ సుభాష్ రెడ్డి, చాకలి హరి తదితర బాధిత రైతులు తమ ఆవేదనను వ్యక్తపరిచారు. ప్రాజెక్టులో భాగంగా నిర్మించే వంద అడుగుల రహదారి పోగా మిగిలిన భూమిని రైతులకు వదిలిపెట్టాలని లేదా ప్రస్తుత బహిరంగ మార్కెట్ ధరను పరిగణనలోకి తీసుకుని తగిన పరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఇప్పటికే పార్లమెంట్ సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు కార్తీక్ రెడ్డి తదితరులు రైతులకు మద్దతు తెలిపారు. బాధిత రైతుల సమస్యలపై శాసనసభ్యులు వెంటనే స్పందించి జిల్లా కలెక్టర్‌తో మాట్లాడారు. ఈ నెల 25వ తేదీ నాటికి తుది నివేదిక సమర్పిస్తామని కలెక్టర్ స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇప్పటికే ఉప ముఖ్యమంత్రి, ఇద్దరు మంత్రులతో కూడిన ప్రత్యేక సంఘాన్ని ఏర్పాటు చేసిందని, కలెక్టర్ నివేదిక వచ్చిన అనంతరం ప్రజాప్రతినిధులు, అన్ని పార్టీల నాయకులతో కలిసి సమావేశం ఏర్పాటు చేసి రైతులకు పూర్తి న్యాయం జరిగేలా ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్తామని ఆశ్వాసన ఇచ్చారు. హైదర్‌గూడ గ్రామ రైతులకు చివరి వరకు అండగా ఉంటామని కాంగ్రెస్ నాయకులు సామ ఇంద్రపాల్ రెడ్డి స్పష్టం చేశారు.

# వట్టినాగులపల్లిలో ఎస్ఐఆర్ ఓటర్ వెరిఫికేషన్ పూర్తి

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** నార్సింగ్ సర్కిల్ పరిధిలోని గండిపేట్ మండలం వట్టినాగులపల్లి గ్రామంలో ఎస్ఐఆర్ ఓటర్ వెరిఫికేషన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామ పంచాయతీ వార్డు కార్యాలయం వద్ద గండిపేట్ మండల ఆర్ఐ సురేష్ సమక్షంలో బీఎల్ఓలు, బీఎల్ఏల ఆధ్వర్యంలో ఓటర్ల వివరాలను పరిశీలించారు. వెరిఫికేషన్ ప్రక్రియ అనంతరం తుది ఓటర్ జాబితాను ఆర్ఐ సురేష్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీఎల్ఓలు గురువన్ గారి రజిత రెడ్డి, మక్త మున్నీ బాయ్, మైలారం ఇంద్ర పాల్గొన్నారు. అలాగే కాంగ్రెస్ పార్టీ తరఫున బుడాల అరుణ్ ముదిరాజ్, బీఆర్ఎస్ పార్టీ తరఫున గురువన్ గారి శ్రీకాంత్ రెడ్డి, బీజేపీ తరఫున మక్త రాఘవేందర్ సింగ్ బీఎల్ఏలుగా పాల్గొన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియను సమన్వయంతో పూర్తి చేసినట్లు నిర్వాహకులు తెలిపారు.



# నేడు నర్సంపేటకు మాజీ సిఎం కెసిఆర్

## పెద్ది కుటుంబ సభ్యులకు పరామర్శ




వరంగల్,ఆగస్టు8 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ నేడు నర్సంపేటకు రానున్నారు. స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించనున్నారు. పార్టీ స్థాపించిన నాటి నుంచి ఎంతో నిబద్ధతతో పనిచేస్తూ, పార్టీ కోసం కృషి చేస్తూ, తన ముఖ్య అనుచరుడుగా కొనసాగిన పెద్ది సుదర్శన్ రెడ్డి మరణంతో కేసీఆర్ విషాదంలో మునిగిపోయారు. ఈ క్రమంలో తన ఆప్తుని కుటుంబ సభ్యులను పరామర్శించడానికి ఆయన నర్సంపేట రానున్నారు. ఈ మేరకు, ఆదివారం నాడు నర్సంపేట నియోజకవర్గంలోని పెద్ది స్వగ్రామమైన నల్లబెల్లికి బయలుదేరి వెళ్ళనున్నారు. ఈ సందర్భంగా, ఇంటి పెద్దను కోల్పోయి శోక తప్త హృదయులై వున్న పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చి కష్ట కాలంలో ఉన్న వారికి భరోసా ఇవ్వనున్నారు. ఇదే సందర్భంలో, నర్సంపేట నియోజకవర్గం పార్టీ నాయకులకు, కార్యకర్తలకు, పెద్ది అభిమానులకు అధినేత కేసీఆర్ గుండె ధైర్యం ఇవ్వనున్నారు. కాగా, పెద్ది కుటుంబాన్ని ఆదుకునేందుకు తన విశాల హృదయాన్ని చాటుకున్న కేసీఆర్ గారు, ఇప్పటికే 2 కోట్ల 25 లక్షల రూపాయలను ఆర్థిక సహాయం ప్రకటించారు. స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ అండగా నిలిచారు. పార్టీ తరపున రెండు కోట్ల 25 లక్షల రూపాయలలను అందజేయాలని నిర్ణయించారు. పార్టీ సీనియర్లు, వరంగల్ జిల్లా ముఖ్య నేతలతో చర్చించిన అనంతరం కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారు. ఇటీవల అనారోగ్యంతో మరణించిన స్వర్గీయ పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ పార్టీ అండగా నిలవాలని అధినేత కేసీఆర్ నిర్ణయించారు. ఇందులో భాగంగానే సుదర్శన్ రెడ్డి ఇద్దరు పిల్లలకు చెరో కోటి రూపాయల చొప్పున ఆర్థిక సహాయం చేయాలని నిర్ణయించారు. అదే సమయంలో పెద్ది సుదర్శన్ రెడ్డి తల్లి అమృతమ్మ వృద్ధాప్యంలో ఉన్నందున వారి బాగోగుల కోసం మరో రూ. 25 లక్షలు రూపాయలను తల్లి పేరు మీద బ్యాంకులో జమ చేయాలని కేసీఆర్ నిర్ణయించారు. తద్వారా మొత్తంగా, 2 కోట్ల 25 లక్షల రూపాయలను పెద్ది సుదర్శన్ రెడ్డి కుటుంబానికి బీఆర్ఎస్ ఆర్థిక సహాయాన్ని అందిస్తూ అండగా నిలవాలని నిర్ణయం తీసుకున్నది. అలాగే పెద్ది సుదర్శన్ రెడ్డి పిల్లల భవిష్యత్తు, వారి చదువు తదితర కుటుంబ సంక్షేమానికి సంబంధించి పార్టీ నిరంతరం పర్యవేక్షిస్తూ అండగా నిలుస్తుందని కేసీఆర్ తెలిపారు. ఈ మేరకు పార్టీ సీనియర్లతో పాటు వరంగల్ జిల్లా పార్టీ సీనియర్ నేతలతో చర్చించి నిర్ణయం తీసుకున్నారు. కాగా దివంగత పెద్ది సుదర్శన్ రెడ్డి దశదినకర్మల కార్యక్రమాలు ముగిసిన తర్వాత జిల్లా పార్టీ ముఖ్యులు కూర్చొని వారి కుటుంబానికి సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన నిర్ణయాలు తీసుకుంటారనీ, ఎల్లకాలం వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందని కేసీఆర్ పునరుద్ఘాటించారు.



# హర్ ఘర్ తిరంగా కార్యక్రమంపై బీజేపీ మండల శాఖ సమావేశం

**గండిపేట(క్రైమ్ మిర్రర్):** స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను స్మరించుకుంటూ, దేశభక్తి భావనను ప్రతి ఇంటికి చేర్చాలనే ఉద్దేశంతో బీజేపీ రాష్ట్ర శాఖ పిలుపు మేరకు హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించాలని శంషాబాద్ బీజేపీ మండల శాఖ నిర్ణయించింది. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో పార్టీ నాయకులు మాట్లాడుతూ ప్రతి గ్రామంలో ప్రతి ఇంటిపై జాతీయ పతాకాన్ని ఎగురవేసి, స్వాతంత్ర్యం కోసం పోరాడిన మహనీయుల త్యాగాలను ప్రజలకు తెలియజేయాలని పిలుపునిచ్చారు. యువతతో పాటు ప్రతి ఒక్కరిలో దేశభక్తి భావాన్ని పెంపొందించేలా కార్యక్రమాలను నిర్వహించాలని పార్టీ శ్రేణులకు సూచించారు. ప్రతి గ్రామంలో హర్ ఘర్ తిరంగా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని సమావేశంలో దిశానిర్దేశం చేశారు. ఈ సమావేశంలో రాష్ట్ర కిసాన్ మోర్చా నాయకులు చంద్రన్నగారు , బీజేపీ నాయకులు మహేందర్ రెడ్డి, వెంకటేష్ చారీ, గండూ రాజు, శ్రీను, నందు, శ్రీనివాస్ నాయక్, సిద్దేశ్వర్ గౌడ్, విజయ్ కుమార్ యాదవ్, నర్సింగ్ ముదిరాజ్, శీను నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# ఆర్య వైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ పుప్పాలగూడ శాఖ ఆధ్వర్యంలో మరిచెట్టు శివాలయ గోశాలకు విరాళం




**గండిపేట(క్రైమ్ మిర్రర్):** ఆర్య వైశ్య అఫీషియల్స్ అండ్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ పుప్పాలగూడ యూనిట్ ఆధ్వర్యంలో మరిచెట్టు శివాలయానికి సంబంధించిన గోశాలకు రూ.51,116 విరాళాన్ని అందజేశారు. పుప్పాలగూడ సభ్యుల నుంచి సేకరించిన మొత్తాన్ని చెక్కు రూపంలో ఆలయ పంతులు మల్లికార్జున శర్మ, టెంపుల్ ఫైనాన్షియల్ సెక్రటరీ రాఘవరెడ్డికి అందించారు. ఈ సందర్భంగా పుప్పాలగూడ యూనిట్ అధ్యక్షుడు దారం వేణుమాధవ్ మాట్లాడుతూ ధార్మిక కార్యక్రమాలకు సహకరించిన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. గోశాలకు విరాళం సేకరించడంలో కీలకంగా వ్యవహరించిన దారం వేణుమాధవ్‌ను రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు బొడ్డు శ్రీధర్, రాష్ట్ర అధ్యక్షుడు మల్లిపెద్ది శంకర్ అభినందించారు. ఈ కార్యక్రమానికి సహకరించిన అవోప పుప్పాలగూడ సభ్యులందరికీ నిర్వాహకులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో దారం భానుచందర్, పబ్బ మల్లేశం, గూడేటి బాలస్వామి, బూరుగు సాయిబాబా, హనుమంతు రాయ్, పందిరి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్‌లో ఈదమ్మ--శ్రీ భూలక్ష్మమ్మ దేవాలయంలో బోనాల సందడి



**గండిపేట(క్రైమ్ మిర్రర్):** రాజేంద్రనగర్‌లోని శ్రీ ఈదమ్మ--శ్రీ భూలక్ష్మమ్మ దేవాలయంలో బోనాల పండుగను పురస్కరించుకుని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అమ్మవారికి అభిషేకం నిర్వహించి నూతన వస్త్రాలతో అలంకరించి భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. బోనాల పండుగ సందర్భంగా దేవాలయాన్ని పూలు, విద్యుత్ దీపాలతో సుందరంగా అలంకరించారు. ఉదయం 7 గంటలకు ఘనంగా తొట్టెల ఊరేగింపు నిర్వహించనున్నారు. అనంతరం భక్తులు బోనాలను స్వీకరించి అమ్మవారికి సమర్పించనున్నారు. బోనాల కార్యక్రమాలు రాత్రి వరకు కొనసాగనున్న నేపథ్యంలో భక్తులకు అవసరమైన సకల సౌకర్యాలను దేవాలయ కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కార్యక్రమంలో దేవాలయ కమిటీ అధ్యక్షుడు వై. శ్రీధర్, ప్రధాన కార్యదర్శి కే. శ్రీధర్‌తో పాటు భక్తులు ఈ. వేణుగోపాల్, ఈ. యాదగిరి, కే. నాగేష్, కే. శశిధర్, రాములు తదితరులు పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.





# ‘టాక్సిక్’లో కియారా ఇంటిమేట్ సీన్స్‌పై ట్రోలింగ్..

## మహిళలనే ఎందుకు టార్గెట్ చేస్తున్నారంటూ హుమా ఖురేషి ఫైర్!

కన్నడ రాకింగ్ స్టార్ యశ్ హీరోగా, గీతు మోహన్‌దాస్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న భారీ యాక్షన్ చిత్రం ‘టాక్సిక్’ విడుదలకు ముందే భారీ అంచనాలను సొంతం చేసుకుంది. ‘కేజీఎఫ్’ సిరీస్ తర్వాత యశ్ నటిస్తున్న సినిమా కావడంతో దేశవ్యాప్తంగా ఈ చిత్రంపై ప్రత్యేక ఆసక్తి నెలకొంది. ఇటీవల విడుదలైన ‘తబాహీ’ పాట సోషల్ మీడియాలో మంచి స్పందన తెచ్చుకున్నప్పటికీ, అందులో హీరో యశ్, హీరోయిన్ కియారా అద్వానీ మధ్య ఉన్న కొన్ని ఇంటిమేట్ సన్నివేశాలు ఇప్పుడు పెద్ద చర్చకు దారితీశాయి. ‘తబాహీ’ పాట విడుదలైన తర్వాత సోషల్ మీడియాలో కియారా అద్వానీపై కొందరు తీవ్ర విమర్శలు చేస్తున్నారు. వివాహం అయ్యాక, తల్లి అయిన తర్వాత ఇలాంటి సన్నివేశాల్లో నటించడం సరైందేనా అంటూ ప్రశ్నిస్తూ ఆమెను లక్ష్యంగా చేసుకుని ట్రోలింగ్ చేస్తున్నారు. కొందరు నెటిజన్లు ఆమె భర్త సిద్ధార్థ్ మల్హోత్రా సోషల్ మీడియా ఖాతాల్లోకి వెళ్లి కూడా అసభ్యకర వ్యాఖ్యలు చేయడం వివాదానికి దారితీసింది. అయితే ఇదే పాటలో నటించిన యశ్‌కు కూడా వివాహం అయ్యి పిల్లలు ఉన్నప్పటికీ, ఆయనపై మాత్రం ఎలాంటి విమర్శలు చేయకుండా ప్రశంసించడం గమనార్హం. ఈ ద్వంద్వ వైఖరిపై సినీ వర్గాలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నాయి. ఈ వివాదంపై తాజాగా స్పందించిన నటి హుమా ఖురేషి, మహిళలను మాత్రమే ఇలా టార్గెట్ చేయడం చాలా బాధాకరమని అన్నారు. ఒక నటిగా పాత్రలో భాగంగా చేసిన సన్నివేశాలను వ్యక్తిగత జీవితంతో ముడిపెట్టి విమర్శించడం చాలా దురదృష్టకరం. మహిళలనే ఇలా వేధించడం అసహ్యంగా ఉంది. ఇలాంటి విమర్శలకు మాటలతో సమాధానం చెప్పాల్సిన అవసరం లేదు. మా సినిమానే ప్రేక్షకులకు సరైన సమాధానం చెబుతుంది. ఆగస్టు 26న విడుదలయ్యే ‘టాక్సిక్’ అందరికీ జవాబు ఇస్తుంది అని ఆమె స్పష్టం చేశారు. హుమా వ్యాఖ్యలకు నటుడు సాకిబ్ సలీమ్ కూడా మద్దతు తెలిపారు. సోషల్ మీడియాలో వ్యక్తుల వ్యక్తిగత జీవితాలపై తీర్పులు ఇవ్వడం ప్రమాదకర ధోరణి అని ఆయన అన్నారు. అలాగే బ్రిటీష్ నటుడు బెనెడిక్ట్ గారెట్ కూడా స్పందిస్తూ, “యశ్‌కు పెళ్లై పిల్లలు ఉన్నా ఎవరూ ప్రశ్నించడం లేదు. అదే కియారా విషయంలో మాత్రం విమర్శలు రావడం సమాజంలో ఇంకా ఉన్న లింగ వివక్షకు నిదర్శనం. నటీనటులు పాత్రల్లో జీవించడం వారి వృత్తి. దాన్ని వ్యక్తిగత జీవితంతో కలపడం సరికాదు” అని వ్యాఖ్యానించారు. ‘టాక్సిక్: ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్-అప్స్’ పేరుతో రూపొందుతున్న ఈ చిత్రంలో యశ్ సరసన కియారా అద్వానీ, నయనతార, హుమా ఖురేషి, తారా సుతారియా, రుక్మిణి వసంత్ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. భారీ బడ్జెట్‌తో తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ప్రపంచవ్యాప్తంగా ఆగస్టు 26న విడుదల చేసేందుకు మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారు.

# ఎనిమిదేళ్ల విరామం తర్వాత వెండితెరపైకి ప్రీతి జింటా: ఆమిర్ ఖాన్ బ్యానర్లో గ్రాండ్ రీఎంట్రీ

ఒకప్పుడు టాలీవుడ్ ప్రేక్షకులను సైతం మెప్పించిన బాలీవుడ్ నటి ప్రీతి జింటా... సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ వెండితెరపై సందడి చేయడానికి సిద్ధమయ్యారు. మహేశ్ బాబుతో ‘రాజకుమారుడు’, వెంకటేశ్ సరసన ‘ప్రేమంటే ఇదేరా’ వంటి చిత్రాలతో తెలుగు ప్రేక్షకులకు అలరించిన ఆమె, వివాహం అనంతరం సినిమాలకు దూరమయ్యారు. ఇప్పుడు దాదాపు ఎనిమిదేళ్ల తర్వాత ఒక భారీ పీరియాడికల్ డ్రామాతో గ్రాండ్ రీఎంట్రీ ఇస్తున్నారు. బాలీవుడ్ స్టార్ సన్నీ డియోల్ సరసన ప్రీతి జింటా కథానాయికగా నటించిన లేటెస్ట్ పీరియడ్ డ్రామా మూవీ ‘బట్వార్ 1947’. 1947 నాటి దేశ విభజన నేపథ్యంలో ఎంతో ప్రతిష్ఠాత్మకంగా రూపుదిద్దుకున్న ఈ చిత్రాన్ని ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై ఆమిర్ ఖాన్ నిర్మించగా, విలక్షణ దర్శకుడు రాజ్‌కుమార్ సంతోషి తెరకెక్కించారు. ఈ భారీ ప్రాజెక్ట్‌కు ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ స్వరాలు సమకూర్చారు. ప్రీతి జింటాతో పాటు సీనియర్ నటి షబానా అజ్మీ, ఆలీ ఫజల్ ఈ చిత్రంలో కీలక పాత్రల్లో కనిపించనున్నారు. దేశ విభజన నాటి పరిస్థితులు, మానవీయ సంబంధాలు, ప్రజలు ఎదుర్కొన్న భావోద్వేగ ఘర్షణల చుట్టూ ఈ కథ తిరుగుతుంది. ఇందులో ప్రీతి జింటా ఎంతో ప్రాధాన్యత ఉన్న, బలమైన పాత్రలో నటించారు. ఇప్పటికే షూటింగ్ పూర్తి చేసుకుని తుది పనులు జరుపుకుంటున్న ఈ చిత్రం, స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్ట్ 14న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది.



# ఈ ఏడాదికాలం నాకు నేర్పింది అదే

నటి అనుపమ పరమేశ్వరన్ భావోద్వేగానికి లోనయ్యారు. గడచిన ఏడాదికాలం తన జీవితం ఎంతో కష్టంగా గడిచిందని, ఒకానొక దశలో మానసికంగా కృంగిపోయానని అనుపమ పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యాలు ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశమయ్యాయి. తమిళ నటుడు ధృవ్‌విక్రమ్‌తో ఆమె ప్రేమలో ఉన్నట్టు, వారి ప్రేమకు బ్రేకప్ అయినట్టు గత కొన్ని రోజులుగా సోషల్ మీడియాలో రూమర్లు వినిపిస్తున్నాయి. తాజాగా అనుపమ పరమేశ్వరన్ మాట్లాడింది ఆ విషయం పైనేనంటూ సోషల్ మీడియాలో కొత్త చర్చ మొదలైంది. ఇంకా చెబుతూ ‘ఎంత కష్టపడితే అంత పరిపూర్ణత సిద్ధిస్తుంది. ఈ ఏడాదికాలం నాకు నేర్పింది అదే. ఇన్నాళ్లూ ఇతరుల కోసం బతికా. నా జీవితం కూడా నా చేతుల్లో లేదు. ఇప్పుడు నాకోసం నేను బతుకుతున్నా. నా జీవితాన్ని నా నియంత్రణలోకి తీసుకున్నా. గతాన్ని వదిలి ధైర్యంగా ముందుకు సాగుతున్నా. ఈ సందర్భంగా కొంతమందికి ఓ విషయం చెప్పాలనుకుంటున్నా. వ్యక్తిగత జీవితంలోని ప్రతి విషయాన్నీ అందరికీ చెప్పాల్సిన అవసరం లేదు’ అంటూ అనుపమ ఘాటుగా స్పందించింది. మరి ఈ వ్యాఖ్యల్లో అంతర్యం ఏమిటో అనుపమకే తెలియాలి.





# తండ్రీకొడుకులుగా మెగాస్టార్?

అగ్ర కథానాయకుడు చిరంజీవికి ద్విపాత్రాభినయాలు కొత్తేం కాదు. నాటి ‘నకిలీ మనిషి’ నుంచి ‘ఖైదీనంబర్ 150’ వరకూ చాలా సినిమాల్లో డ్యూయెల్ రోల్స్‌తో అదరగొట్టారాయన. ప్రస్తుతం చిరంజీవి నటిస్తున్న ‘మెగా 158’(వర్కింగ్ టైటిల్) చిత్రంలో కూడా ఆయన ద్విపాత్రాభినయం చేస్తున్నట్టు విశ్వసనీయ సమాచారం. మెగాస్టార్‌ని కొత్తగా చూపించాలనే తపనతో దర్శకుడు కేఎస్ రవీంద్ర(బాబీ) తయారు చేసుకున్న కథ ఇది. ఇందులో చిరంజీవి పాత్రల్లో చాలా వేరియేషన్స్ ఉంటాయట. మరో ఆసక్తికరమైన విశేషం ఏంటంటే.. ఇందులో చిరంజీవి తండ్రి, కొడుకులుగా కనిపిస్తారని తెలిసింది. ఈకథలో ఫ్యామిలీ ఎమోషన్స్ కూడా బలంగా ఉంటాయట. బ్లాక్‌బస్టర్ ‘వాల్తేరు వీరయ్య’ తర్వాత చిరు, బాబీ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో అంచనాలు భారీస్థాయిలో ఉన్నాయి. సంక్రాంతి రిలీజ్ టార్గెట్‌గా శరవేగంతో చిత్రీకరణ జరుపుతున్నారు. ఈ సినిమా టైటిల్, టీజర్‌ని చిరంజీవి పుట్టిన రోజు సందర్భంగా ఈ నెల 22న విడుదల చేయనున్నారు. కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె.నారాయణ, లోహిత్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్న విషయం తెలిసిందే.

Printed, Published and Edited by Makam Gangadhar, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Owned by Makam Gangadhar and Printed at MGR Publications, H.No. 11-13-1100, Dwarakanagar Colony, Saroornagar, Ranga Reddy Dist. 500 035. T.S. Editor & Managing Director: Makam Gangadhar +919393446188, RNI No. APTEL/2012/45151.